హైదరాబాద్ వార్త



# పోలీసులు, హైడ్రా అధికారులకు నేతల నుంచి సవాళ్లు

**-అడ్డంకులను అధిగమించడంపై అధికారుల మల్లగుల్లాలు**





**హైదరాబాద్, ఫిబ్రవరి, 8, ప్రభాతవార్త:** జంట నగరాలు, శివార్లలో ఫుట్‌పాత్‌లు, పార్కులను ఆక్రమించుకుని వున్న నిర్మాణాలను తొలగించడంలో అటు పోలీసులకు ఇటు హైడ్రా అధికారులకు స్థానిక నేతల నుంచి ఎదురవుతున్న సవాళ్లు ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయి. కొన్నిచోట్ల సాక్షాత్ ఎంఎల్ఎలే అడ్డుతగులుతూ కూల్చివేతలను నిలువరిస్తుండడంతో అధికారులకు ఎటూ పాలుపోవడం లేదు. ఈ విషయంలో కొందరు ఎంఎల్ఎలు మరో అడుగు ముందుకేసి దమ్ముంటే కూల్చివేతలు పాతబస్తీ నుంచి మొ దలు పెట్టాలని సవాల్ చేస్తుండడం అధికారులకు మింగుడు పడడం లేదు. గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో ఫుట్‌పాత్‌లను ఆక్రమించుకుని వున్న నిర్మాణాలను, పార్కులను కబ్జాచేసి చేబట్టిన నిర్మాణాల తొలగింపు ఒక అడుగు ముందుకు రెండు అ డుగులు వెనక్కు అన్నట్లుగా సాగుతోంది. కొన్నిచోట్ల ఆక్రమణల తొలగింపు సవ్యంగా సాగుతున్నా మెజారిటీ ప్రాంతాలలో అడుగడుగునా అడ్డంకులు తప్పడం లేదు. ఈ విషయంలో పోలీసులకు, హైడ్రా అధికారులకు ప్రభుత్వం నుంచి స్పష్టమైన ఆదేశాలున్నా ఆయా ప్రాంతాలలో నెలకొన్న పరిస్థితులు వారిని ముందుకు సాగనివ్వడం లే దు. ఉదాహరణకు ఖైరతాబాద్‌లోని పలుచోట్ల పోలీసులు, హైడ్రా అధికారులు ఎప్పుడు కూల్చివేతలు చేబట్టినా అధికార పార్టీ ఎంఎల్ఎ దానం నాగేందర్ అడ్డు తగులు తుండడం అధికార వర్గాలను షాక్‌కు గురిచేస్తోంది. ఒక్క ఖైరతాబాద్ మాత్రమే కాదు. ఇతరచోట్ల కూడా ఇదే పరిస్థితి నెలకొందంటే అతిశయోక్తి కాదు. గ్రేటర్ పరిధిలో రోడ్డు ప్రమాదాలను నివారించేందుకు, వాహనాలు సాఫీగా వెళ్లేందుకు, పాదచారులు నడిచేందుకు వీలుగా ఫుట్‌పాత్‌ల ఆక్రమణలను ఆపరేషన్ రోప్‌లో భాగంగా పోలీ సులు ఎక్కడికక్కడ తొలగిస్తుండగా పార్కులను కబ్జా చేసిన వారిపై హైడ్రా అధికారులు కొరడా ఝుళిపించసాగారు. వాస్తవానికి ఇది మంచి కార్యక్రమమే అయినా స్థానిక నేతల నుంచి తీవ్ర వ్యతిరేకత ఎదురవుతోంది. సహజంగా అధికారుల చర్యలను ప్రతిపక్ష పార్టీల నేతలు అడ్డుకోవడం, విమర్శించడం పరిపాటి. కానీ ఖైరతాబాద్‌లో దానం నాగేందర్ కాంగ్రెస్ పార్టీలో వుండి కూడా దీనిని వ్యతిరేకించడం అధికారులకు రుచించడం లేదు. స్థానిక నేతల వ్యతిరేకత కారణంగా ఫుట్‌పాత్‌ల ఆక్రమణలు, పార్కుల కబ్జాలను తొలగించడం పోలీసులు, హైడ్రా అధికారులకు కష్టంగా మారుతోంది. కొన్నిచోట్ల మధ్యేమార్గంగా ఒకటీ అరా తొలగిస్తున్నా చాలాచోట్ల తొలగించడం అసలే కుదరడం లేదు.

**పాతబస్తీలోనూ అదే పరిస్థితి**

గ్రేటర్ పరిధిలో ఇతర ప్రాంతాలలో కొంతలో కొంతగా కూల్చివేతలు జరుగుతున్నా పాతబస్తీలో పరిస్థితి ముందుకు సాగడం లేదని పోలీసులు, హైడ్రా అధికారులే అ ంటున్నారు. ఫుట్‌పాత్‌ల ఆక్రమణ నగరంలోని ఇతర ప్రాంతాలలో వున్నట్లు పాతబస్తీలోనూ వుంది. ఇదే సమయంలో పార్కుల కబ్జాలు కూడా వున్నాయి. అయితే పాతబస్తీలో వీటి తొలగింపు ఒక అడుగు ముందుకు వెళితే 30 అడుగులు ముందుకు అన్నట్లుగా వుందని చెప్పాలి. ఈ విషయంలో పోలీసులు కానీ బల్దియా అధికారులు కానీ ధైర్యం చేసి ముందుకు వెళితే శంకరగిరిమాన్యాలు పట్టాల్సిందే. ఉదాహరణకు మదీనా నుంచి చార్మినార్ వరకు వాకర్ జోన్ వుండగా ఇందుకోసం ఎంపిక చేసిన ఫుట్‌పాత్‌లు రెండు వైపులా ఏనాడో ఆక్రమణలకు గురైనా వీటిని తొలగించే సాహసం ఏ విభాగం అధికారులు కూడా ఇప్పటి వరకు చేయలేదంటే ఇక్కడ పరిస్తితిని ఊ హించుకోవచ్చు. మదీనా చౌరస్తా నుంచి హైకోర్టు మీదుగా సిటీ కాలేజి వరకు గల మార్గంలో ఫుట్‌పాత్ ఆక్రమణ మరింత తీవ్రంగా వుందని చెప్పాలి. పాతబస్తీలోని ఇ తర ప్రాంతాలలోనూ ఇలాంటి పరిస్థితులు కనిపిస్తాయి. ఈ విషయంలో అధికారులు మౌనంగా వుండడం వల్లే ఇతర ప్రాంతాలలో ఫుట్‌పాత్‌ల కూల్చివేతలను ఆయా ప్రాంతాల నేతలు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. అధికారులకు దమ్ముంటే ముందు పాతబస్తీలో కూల్చివేతలు చేబట్టాలని సవాల్ విసురుతున్నారు. ఈ విషయంలో దానం నాగేందర్ సహా కొందరు నాయకులు అధికారుల తీరును తప్పుబడుతూ అవసరం అయితే తాము జైలుకు వెళ్లేందుకు కూడా సిద్దమని చెబుతున్నారు. మొత్తం మీద ఫుట్‌పాత్‌ల ఆక్రమణలు, పార్కుల కబ్జాలను తొలగించడం పోలీసులు, హైడ్రా అధికారులకు పెను సవాల్‌గా మారింది. ఈ సమస్యను సర్కారు ఎలా చక్కదిద్దుతుందో? చూడాల్సి వుంది.

# కారుకేదీ కళ్లెం..!

**-నగరంలో దారెత్తిస్తున్న కార్లు**
**-అతివేగం, మద్యం మత్తు కారణంగా ప్రమాదాలు**
**-సంస్థాగత లోపాలతోనూ నిత్యం ఎన్నో ఇబ్బందులు**

**హైదరాబాద్, ఫిబ్రవరి 10 ప్రభాతవార్త**

నగరంలో కార్లు దారెత్తిస్తున్నాయి. రాజధానిలో కార్లు జనాలను భయపెడుతున్నాయి. వరుస ప్రమాదాలతో వణికిస్తున్నాయి. పెరిగిన కార్ల సంఖ్య ప్రమాదాలనూ పెంచుతున్నాయి. పలువుర్ని మృత్యుముఖంలోకి నెడుతున్నాయి. నగరంలో వాహనాల వేగ పరిమితులకు సంబంధించి సిటీ పోలీసుల నోటిఫికేషన్ ఆధారంగా పరిశీలిస్తే ఆటోలు, ఆటో ట్రాలీలు తదితరాల గరిష్ట వేగం నిర్ధారించారు. జిహెచ్ఎంసి పరిధిలో కార్ల గరిష్ట వేగం గంటలకు 60 కి.మీగా నిర్ణయించారు. అలాగే డివైడర్లు ఉన్న రోడ్లపై కార్లకు 50కి.మీ, కాలనీలలో 30కిమీగా నిర్ణయించారు. అలాగే గూడ్స్, బస్సులు, ఆటోలు, మోటార్ సైకిళ్లకు గంటకు 50కి.మీగా నిర్ణయించారు. డివైడర్లు ఉన్న రోడ్లపై 40కి.మీ, కాలనీలలో 30 కి.మీగా స్పీడ్ లిమిట్ నిర్ణయించారు. ఇక ఔటర్‌రింగ్ రోడ్‌లో వాహనాల స్పీడ్‌కు అడ్డుఅదుపు లేకుండా పోతోంది. ఇటీవల జరుగుతున్న ప్రమాదాలకు అతివేగంతోపాటు మద్యం మత్తే కారణంగా ఉన్నాయి. గ్రేటర్ పరిధిలో తరచుగా ఏదో ఒక ప్రాంతంలో కారు ప్రమాదాలు జరుగుతూనే ఉన్నాయి. అత్యధిక ప్రమాదాలు ఓవర్ స్పీడింగ్ వల్లేనని పోలీసులు చెబుతున్నారు. ఇలాంటి ఘటనలు చోటు చేసుకోవడంతో అనేక కారణాలు ఉంటున్నాయని పోలీసులు వివరిస్తున్నారు. ఏటా నగరంలో జరుగుతున్న రోడ్డు ప్రమాదాల్లో తేలికపాటి వాహనాలుగా పిలిచే కార్ల వాటా పది శాతానికి పైగా ఉంటోంది. ప్రధానంగా మద్యం మత్తులో డ్రైవింగ్ చేయడంతో పాటు నిర్లక్ష్యంగా వాహనం నడపడం ద్వారా ప్రమాదాలకు కారణంగా మారుతోంది. వాటికితోడు నగరంలోని రహదారుల్లో ఉన్న ఇంజనీరింగ్ లోపాలు, డ్రైవర్ల నిద్రమత్తు సైతం ప్రమాద హేతువులుగా మారుతున్నాయి. సిటీలో వంపులులేకుండా ఉన్న రహదారుల్ని వేళ్లమీద లెక్కట్టొచ్చు.

**డ్రైవింగ్‌పై పూర్తి పట్టులేకపోవడంతో..**

ఇటీవల కాలంలో నగరంలో కార్ల సంఖ్య గణనీయంగా పెరుగుతోంది. గ్రేటర్ పరిధిలో 82లక్షలుపైగా వాహనాలు ఉన్నాయి. ఇందులో కార్లు సుమారు 15లక్షలు, క్యాబ్‌లు లక్ష వరకు ఉన్నాయి. ప్రజల జీవన ప్రమాణాలతో పాటు సెకండ్ హ్యాండ్ మార్కెట్ పెరగడం, ఫైనాన్సింగ్ విధానాలు ఇలా అనేక కారణాల నేపథ్యంలో కార్లు ఖరీదు చేస్తున్న వారు ఎక్కువగానే ఉంటున్నారు. వీరంతా ప్రాథమికంగా వివిధ డ్రైవింగ్ స్కూళ్లల్లోనో, పరిచయస్తుల వద్దో డ్రైవింగ్ నేర్చుకుంటున్నారు. ఆ సమయంలో వీరి దృష్టం తా స్టీరింగ్, క్లచ్, బ్రేక్‌లపైనే ఉంటోంది. ఈ మూ డింటినీ నిర్వహించగలిగితే ఎక్కడైనా వాహనం నడుపవచ్చని భావిస్తున్నారు. అయితే హఠాత్‌పరి ణామాలు, ఓవర్ టేకింగ్ తదితర సందర్భాల్లో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వీరికి పూర్తి స్థాయిలో పట్టు ఉండట్లేదు. దీంతో నామ్‌కే వాస్తేగా నేర్చు కుని రోడ్లపైకి వస్తున్న వాహనచోదకులు అనేక సందర్భాల్లో ప్రమాదాలకు లోనుకావడంతో పాటు కారకులుగానూ మారుతున్నారు. దీనికి తోడు డ్రైవింగ్ లైసెన్సుల జారీ విధానంలో ఉన్న లోపాలూ ఈ తరహా ప్రమాదాలకు కారణంగా మా రుతున్నాయి.

-ఇక వీకెండ్స్‌లో డ్రంకన్ డ్రైవ్ తనిఖీలకు సరిపోను సిబ్బంది లేక ఇబ్బందులు ఎదురవుతున్నాయి. దీన్నే మందుబాబులు తమకు అనుకూలంగా మార్చుకుని రెచ్చిపోతూ ప్రమాదాలకు కారణమవుతున్నారు.

-స్పీడ్ థ్రిల్స్..బట్ కిల్స్ అనే నానుడిని పోలీసులు, ఆర్టీఏ విభాగాలు నిత్యం ప్రచారం చేస్తూనే ఉంటాయి. అయినప్పటికీ హైఎండ్ వాహనాలపై వీలున్నంత వేగంగా దూసుకుపోవడం కొందరు వాహనచోదకులకు నిత్యకృత్యమైంది. రద్దీ రోడ్లలోనూ విచ్చలవిడి స్పీడ్‌తో, విన్యాసాలతో దూసుకుపోయే యువత ఎంతో ఉంటున్నారు. రాత్రి వేళల్లో, విశాలంగా, ఖాళీగా కనిపిసుతన్న రోడ్లపై వీరి విషయం ఇక చెప్పక్కర్లేదు.

-నగరంలోని రోడ్ల స్థితిగతులు, వాహనాల గరిష్ట వేగం తదితర అంశాలపైనే ఇక్కడ పరిగెత్తే వాహనాలు ఆధారపడి ఉంటాయి. అయితే సిటీలో సరాసరి వేగం గరిష్టంగా గంటకు 18 కి.మీగా ఉంటే ఇక్కడ అందుబాటులో ఉంటున్న దిగుమతి చేసుకుంటున్న వాహనాల గరిష్ట వేగం గంటకు 200 కిమీ కంటే ఎక్కువే ఉంటోంది.

ఇదే అనేక సందర్భాల్లో ప్రమాదాలకు హేతువుగా మారింది. ఏటా జరుగుతున్న రోడ్ల ప్రమాదాల్లో బాధితులుగా మారుతున్న వారిలో యువతే ఎక్కువగా ఉంటున్నారు. ప్రమాదాలకు లోనవుతున్న వాటిలో ద్విచక్రవాహనాల తర్వాతి స్థానం కార్లదే.

# ప్రతియేటా నుమాయిష్‌కు పెరుగుతున్న ఆదరణ

**-నేటి వరకు 15లక్షలకు పైగా నుమాయిష్‌ను తిలకించిన సందర్శకులు**

**ప్రభాతవార్త, అబిడ్స్ ప్రతినిధి:** విద్యుత్ కాంతుల వెలుగు జిలుగులు....కళ్లు చెదిరే ఇంటీరియర్ డెకరేషన్....భారీ పరిశ్రమలుమొదలుకొనికుటీర పరిశ్రమల్లో తయారైన ఉత్పత్తుల ప్రదర్శన....ప్రత్యేక ఆకర్షణగా నిలిచే హస్తకళా రూపాలు..అలరించే చుక్‌చుక్ రైలు....గాలిలో తేలిపోయే అనుభూతిని కలిగించే రంగుల రాట్నం..నోరూరించే తినుబండారాలు....తదితర అన్ని హంగులతో నడుస్తున్న నుమాయిష్'సందర్శకులు విశేషంగా అలరిస్తోంది. 84వ అఖిలభారత పారిశ్రామిక ప్రదర్శన'లో సందర్శకులను ఎంతో ఆకట్టుకుంటుంది. శనివారం ఒక రోజు మాత్రమే 60వేలమందిపైగా సందర్శకులు నుమాయిష్‌ను తిలకించినట్లు సొసైటి కార్యదర్శి ప్రభాశంకర్, కోశాధికారి ఎన్. వినయ్‌కుమార్‌లు తెలిపారు. నగర ఖ్యాతిని విదేశాలకు సైతం వ్యాప్తి చేస్తుంది. ఇతర ప్రాంతాలనుంచి తరలివచ్చే సందర్శకులు ఎగ్జిబిషన్‌ను తిలకించి ఆనందాన్ని పొందుతున్నారు. ప్రపంచమే ఒక గ్లోబల్ విలేజ్‌గా మారిన నేటి తరుణంలో 84వ నుమాయిష్ ప్రదర్శన సందర్శకులను అమితంగా అకట్టుకోవడంతోపాటు నేటికి ప్రజల్లో నేటికి ఏమాత్రం ఆదరణ తగ్గలేదు. చిన్నా.పెద్దఅనే తారతమ్యం వయో బేధం లేకుండా అందరు కలిసి కట్టుగా కుటుంబ సమేతంగా సందర్శించడం జరుగుతుంది. ప్రైవేట్ సంస్థలతోపాటు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు చెందిన స్టాళ్లు కూడా ఎంతో వినియోగదారులను ఆదరణను చూరగొంటున్నాయి. డ్వాక్రా మహిళలకు కూడా ఎగ్జిబిషన్‌లో స్థానం కల్పించారు. పేరొందిన బ్యాంకులు, వివిధ ప్రభుత్వశాఖలుపేరొందిన కార్పొరేట్ సంస్థలు తమ ఉత్పత్తులను ప్రదర్శిస్తున్నాయి. నెలకొల్పిన స్టాళ్లలో తమ సరికొత్త ఉత్పత్తులను ప్రత్యేకంగా అందుబాటులో ఉంచారు. పేరొందిన ఎలక్ట్రానిక్స్ స్టాళ్లతోపాటు కొనుగోలుదారులకు ఎంతో వెసులు బాటు కల్పిస్తున్నారు. మరికొన్ని సంస్థలు ప్రత్యేకంగా పలు ఉత్పత్తుల కొనుగోలుపై డిస్కౌంట్ రేట్ల ద్వారా అమ్మకాలు చేస్తున్నారు. అలంకరణ సామాగ్రి, ఇంటీరియర్, ఆర్టికల్స్, వస్త్రాలు, క్రాకరీ ఉత్పత్తులు, కార్పెట్లు, చద్దర్లు, దుప్పట్లు, తినుబండారాలు, పచ్చళ్లు, తదితరాలు ప్రదర్శనలో చోటు చేసుకున్నాయి. మహిళలె మెచ్చే హైదారబాదీ గాజులు, పట్టుచీరలు, కాలానుగుణంగా వస్తున్న సరికొత్తడిజైన్లతో కూడిన యువతులు దుస్తులు, పిల్లలు, మెచ్చే రెడీమేడ్ దుస్తులు, వైరైటి ఆల ంకరణ సామాగ్రి అన్ని వయస్సుల వారిని ఆకర్షించే వస్త్రాలు, మహిళలు పిల్లలను ఆకట్టుకునేందుకుగాను ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తున్నాయి.

**చుక్ చుక్ రైలు...**

అన్ని వయస్సుల వారిని గత 40 రోజులుగా నుమాయిష్‌లో చుక్‌చుక్ రైల్, ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తున్నాయి. పిల్లల నుంచి పెద్దల వరకు అందరినీ అలరిస్తూ ఎగ్జిబిషన్‌ను పూర్తిగా చుట్టు వచ్చే బుల్లి రైల్, ఆకాశాయనం చేసిన అనుభూతిని కలిగించే రంగుల రాట్నాలు వయో భేదం లేకుండగా అందరి ఆదరణను చూరగొంటున్నాయి. ఎంచక్కా ఎగ్జిబిషన్ అంతా నిమిషాలలో చుట్టి వచ్చేందుకుగాను వీలు కలిగించిన చుక్‌చుక్ రైల్ ఎక్కాలని సందర్శకులను ఉత్సాహం చూపుతున్నారు. అబిడ్స్ ఎ.సి.పి చంద్రశేఖర్ ఆద్వర్యంలో బేగంబజార్ ఇన్‌స్పెక్టర్లు విజయ్‌కుమార్ పర్యవేక్షణలో అను నిత్యం తమ సిబ్బంది ద్వారా బందో బస్తును పర్యవేక్షిస్తున్నారు. దీనికి తోడు, గోషామహల్ ట్రాఫిక్ ఎసిపి ధనలక్ష్మి పర్యవేక్షణలో ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ బాలాజీ ఆద్వర్యంలో వివిధ పోలీస్‌స్టేషన్ల నుంచి వచ్చిన ట్రాఫిక్ పోలీసు పోలీసు అధి కారులకు, సిబ్బందికి సూచనలు చేస్తూ ఎలాంటి ఇబ్బందులు ఎదురు కాకుండా ప్రత్యేక చర్యలను తీసుకుంటున్నారు. ఎగ్జిబి షన్‌నుంచి, ప్రధాన రహదారి వరకుని ఘా కెమెరాలలో కూడా సందర్శకులను గమనిస్తున్నారు.

# పాతబస్తీ మదీనా అబ్బాస్ టవర్స్‌లో అగ్ని ప్రమాదం

**-బూడిదైన 60 వస్త్రాల దుకాణాలు -కోట్లాది రూపాయల ఆస్తి నష్టం**





**చార్మినార్, ఫిబ్రవరి 10 ప్రభాతవార్త :** హైదరాబాద్ పాతబస్తీ దివాన్ దేవిడిలోని ఓ వస్త్రాల మార్కెట్‌లో సోమవారం తెల్లవారు జామున భారీ అగ్ని ప్రమాదం జరిగిన సంఘటన చార్మినార్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పెద్ద ఎత్తున మంటలు వ్యాపించటంతో అరవైకు పైగా పలు రకాల వస్త్రాలు దుకాణాలు పూర్తిగా కాలిపోయాయి. చార్మినార్ పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని ఫైరింజన్లు రప్పించి మంటలు ఆర్పి వేశారు. పాతబస్తీలోని వస్త్రాల మార్కెట్లలో ఇంత పెద్ద అగ్ని ప్రమాదం జరగటం ఇదే మొదటి సారి. చార్మినార్ పోలీస్ స్టేషన్ అడిషనల్ ఇన్‌స్పెక్టరు కె.బ్రహ్మ మురారీ కథనం ప్రకారం......హైదరాబాద్ పాతబస్తీ మదీనా సమీపంలో మదీనా అబ్బాస్ టవర్స్ ఉంది. నాలుగు అంతస్థులలోని షాపులలో వస్త్రాల వ్యాపారులు రెడిమేడ్ దుస్తులతో పాటు పలు రకాల బట్టలు హోల్‌సేల్ రిటైల్‌లలో అమ్ముతున్నారు. ఆదివారం షాపులకు సెలవు కావటంతో మదీనా అబ్బాస్ టవర్స్‌లోని దుకాణాలు మూసి వేసి ఉన్నాయి. కాగా ఆదివారం అర్ధరాత్రి దాటిన తర్వాత సోమవారం తెల్లవారు జామున మదీనా అబ్బాస్ టవర్స్‌లోని రెండవ అంతస్తులో ఒక్కసారిగా మంటలు లేచాయి. మంటలు ఉద్రితమై టవర్స్‌లోని ఇతర షాపులకు అంటుకున్నాయి. సమాచారం అందుకున్న చార్మినార్ పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని మొగల్‌పుర ఫైరింజన్‌తో పాటు మరో ఎనిమిది ఫైరింజన్లను రప్పించి మంటలను ఆర్పివేశారు. సోమవారం తెల్లవారు జామున రెండు గంటలు నుంచి సాయంత్రం ఆరు గంటలువరకు ఫైరి ఇంజన్లు నీరును షాపులలోకి వదలటంతో పూర్తిగా మంటలు అదుపులోకి వచ్చాయి. కాగా దివాన్‌దేవిడిలో పెద్ద అగ్నిప్రమాదం జరగటంతో పాతబస్తీలోని పలు ప్రాంతాలు నుంచి పెద్ద ఎత్తున ప్రజలు సంఘటన స్థలానికి వచ్చారు. దివాన్ దేవిడిలో జరిగిన అగ్ని ప్రమాదంలో దాదాపు అరవైకు పైగా వస్త్రాలు షాపులు పూర్తిగా కాలి పోయాయి. దుకాణాలలోని బట్టలు పూర్తిగా బూడిద అవ్వటంతో వస్త్రాల వ్యాపారులు రోధిస్తున్నారు. ఒక వస్త్రాల వ్యాపారానికి చెందిన 24 వస్త్రాల షాపులు కాలి పోయాయని పోలీసులు తెలిపారు. 24 షాపులలో దాదాపు ఐదు కోట్ల రూపాయల ఆస్తి నష్టం జరిగింది. మదీనా అబ్బాస్ టవర్స్‌లో కాలిపోయిన అరవైకి పైగా షాపులలో కోట్లాది రూపాయల వస్త్రాలు బూడిద అయ్యాయని అదనపు సిఐ కె.బి.మురారీ తెలిపారు. దక్షిణ మండలం అడిషనల్ డిసిపి ఎంఎ జావిద్, చార్మినార్ ఎమ్మెల్యే మీర్ జుల్ఫికర్ అలీ, ఫత్తర్ గట్టి డివిజన్ కార్పొరేటర్ సోహెల్ ఖాద్రిలు అగ్ని ప్రమాదం జరిగిన మదీనా అబ్బాస్ టవర్స్‌ను సందర్శించారు. విద్యుత్ షార్క్ సర్క్యూట్ వల్లనే అగ్ని ప్రమాదం జరిగి ఉండ వచ్చునని భావిస్తున్నారు. అగ్ని ప్రమాదంలో ఆస్తి నష్టం పూర్తి వివరాలు ఇంకా తెలియ లేదు. ఈ కేసును చార్మినార్ పోలీసులు అన్ని కోణాలు నుంచి దర్యాప్తు చేస్తున్నారు.

## అక్రమ నిర్మాణాలను కూల్చివేసిన రెవెన్యూ అధికారులు..

**-కలెక్టర్ ఆదేశాలతో దిగివచ్చిన అధికారులు..**



అక్రమ నిర్మాణాలను కూల్చివేసిన అధికారులు

**నిజాంపేట్, ఫిబ్రవరి 10, ప్రభాతవార్త**

బాచుపల్లి మండలం, నిజాంపేట్ మునిసిపల్ కార్పొరేషన్ పరిధిలో సర్వే నెంబర్ 223 ప్రభుత్వ స్థలంలోని 1100 గజాల స్థలంలో ఆదివారం కొందరు వ్యక్తులు ప్రహరీ గోడ నిర్మాణానికి పూనుకున్నారు. విషయం స్థానికుల ద్వారా సమాచారం అందుకున్న మాజీ మేయర్ కొలను నీలారెడ్డి, బిజెపి మాజీ అధ్యక్షులు ఆకుల సతీష్‌తో పాటు కాలనీ వాసులతో కలిసి సోమవారం కలెక్టర్ కార్యాలయానికి తరలివెళ్లారు. ప్రజావాణిలో పిర్యాదు చేసారు. పిర్యాదు అందిన వెంటనే బాచుపల్లి రెవిన్యూ కార్యాలయానికి ఆదేశాలు జారీ అయ్యాయి. ఆదేశాలు అందిన వెంటనే తహసిల్దార్ పూల్సింగ్ చౌహన్ హుటాహుటిన్ తన సిబ్బందిని కబ్జా ప్రదేశానికి పంపించి కూల్చివేయించారు. అదేవిధంగా బాచుపల్లి పరిధిలో వెలసిన రెండు అక్రమ నిర్మాణాలను నేలమట్టం చేసారు.

## గంజాయిని తరలిస్తున్న ఇద్దరు వ్యక్తుల అరెస్టు

**-10 కిలోల గంజాయి స్వాధీనం**



గంజాయి తరలిస్తున్న ఇద్దరు వ్యక్తులు అరెస్టు చేసిన ఎక్సైజ్ అధికారులు

**అడ్డగుట్ట, ఫిబ్రవరి 10 ప్రభాతవార్త:** గుట్టుచప్పుడు కాకుండా కారులో గంజాయిని సరఫరా చేస్తున్న ఇద్దరు వ్యక్తులను ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ టీమ్ వలపన్ని పట్టుకొని వారి వద్ద నుంచి 10 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. ఈ సంఘటనకు సంబంధించి వివరాలు ఇలా ఉన్నాయి. బోయిన్‌పల్లికి చెందిన టీ.శేఖర్ 27, సి.సునీల్ 18 వృత్తిరీత్య హెచ్ఎంటీ కంపెనీలో ఉద్యోగం చేస్తున్నారు. జీతం సరిపోవడం లేదని గంజాయిని విక్రయిస్తే సులువుగా డబ్బులు సంపాదించవచ్చన్న ఉద్దేశంతో బోయిన్‌పల్లికి చెందిన ఇద్దరు వ్యక్తులు అరకు నుంచి హైదరాబాద్‌కు కారులో 10 కిలో గంజాయిని తరలిస్తున్నారు. సికింద్రాబాద్ జింఖానా గ్రౌండ్ నుంచి అల్వాల్‌కు వెళ్తున్న క్రమంలో ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ సిఐ వెంకటేశ్వర్లు తన బృందం అనుమానంతో ఆ కారును తనిఖీ చేయగా 10 కిలోల గంజాయి దొరికింది. ఈ కారులో ఉన్న ఇద్దరు డ్రైవర్లు, శేఖర్, అనీల్ కుమార్‌లతో పాటు కారును స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు.

## భారతీయ పౌరులను అమెరికా బహిష్కరించినందుకు వినూత్న నిరసన





ప్రదర్శన నిర్వహిస్తున్న ఎఐవైఎఫ్ కార్యకర్తలు

**సైఫాబాద్, ఫిబ్రవరి 10 ప్రభాతవార్త:** అమెరికా దేశం 108 మంది భారతీయ పౌరులను బహిష్కరించి అమానవీయ, ఆమోదయోగ్యం కాని విధానాన్ని చేపట్టినందుకు తీవ్రంగా ఖండిస్తూ, అమెరికా సైనిక విమానంలో సంకెళ్లు వేసుకుని, పరిమిత కదలికతో వ్యక్తుల ప్రయాణం చేయమని బలవంతం చేయడం మానవ హక్కులను ఉల్లంఘించడమేనని ఎఐవైఎఫ్ ఆరోపించింది. ఇలాంటి ప్రవర్తన దారుణమని తీవ్రంగా ఖండిస్తున్నామని ఎఐవైఎఫ్ పేర్కొంది. ఎఐవైఎఫ్ హైదరాబాద్ జిల్లా కార్యదర్శి నెర్లకంటి శ్రీకాంత్ ఆధ్వర్యంలో ఆనేక మంది కార్యకర్తలు సోమవారం సత్యనారాయణరెడ్డి భవన్ నుంచి హిమాయత్‌నగర్‌లోని వై జంక్షన్ వరకు వినూత్న పద్ధతుల్లో చేతులకు సంకెళ్ళు వేసుకుని నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్బంగా వారు అమెరికా అధ్యక్షుడు ట్రంప్, నరేంద్రమోదీ కలిసి ఉన్న ఫ్లెక్సీని దగ్ధం చేశారు. అనంతరం ఎఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వలిఉల్లా ఖాద్రీ, కల్లూరి ధర్మేంద్ర మాట్లాడుతూ భారత పౌరులను అమెరికా దుర్మార్గంగా వ్యవరించడాన్ని అభ్యంతరం చెప్పడంలో ప్రధాని నరేంద్రమోదీ ప్రభుత్వం విఫలం చెందిందని ఆరోపించారు. ప్రపంచవ్యాప్తంగా భారతీయుల ప్రయోజనాలు కాపాడుతామని ప్రకటించిన కేంద్ర ప్రభుత్వం ఈ కఠినమైన చర్యలను నివారించడంలో విఫలం చెందిందని వారు ధ్వజమెత్తారు. అమెరికా మరి కొంత మంది భారతీయ వలసదారులను బహిష్కరించాలని ప్రయత్నిస్తున్నందున వారి హక్కులను కేంద్రం కాపాడాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎఐవైఎఫ్ నాయకులు శ్రీమాన్, షేక్ మహమూద్, మాజీద్ ఆలీ తదితరులు పాల్గొన్నారు.

## పిల్లల ఫీజులు కట్టలేక రాపిడో డ్రైవర్ ఆత్మహత్య

**సరూర్‌నగర్, ఫిబ్రవరి 10 ప్రభాతవార్త:** ఆర్థిక ఇబ్బందులతో పిల్లల చదువులకు సైతం ఫీజులు కట్టలేని దుస్థితిలో కొట్టుమిట్టాడిన ఓ వ్యక్తి ఇంట్లోనే ఉరి వేసుకొని బలవర్మణానికి పాల్పడ్డాడు. ఈ విషాదకర సంఘటన మీర్‌పేట్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు కథనం ప్రకారం భార్య, ఇద్దరు కూతుళ్ళతో కలిసి జిల్లెలగూడలో నివసిస్తున్న పుస్తకాల శ్యామ్ ప్రసాద్ (40) అనే వ్యక్తి రాపిడో డ్రైవర్‌గా పని చేసి గత రెండు నెలల నుండి ఖాళీగా ఉంటున్నాడు. ఈ నేపథ్యంలో అతను గత కొన్ని రోజులుగా ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతున్నాడు. ఈ పరిస్థితుల్లో పిల్లల చదువులకు సంబంధించిన స్కూల్ ఫీజులు కూడా కట్టలేకపోతున్నానని భార్యతో చెప్పుకొని బాధపడ్డాడు. సోమవారం మధ్యాహ్నం ఇంట్లో భార్య ఉండగానే బెడ్ రూంలో ఉన్న ఫ్యానుకు ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. కొద్ది సేపటి తర్వాత గదిలోకి వచ్చిన భార్య ప్రియాంక భర్త ఉరి వేసుకొని ఉండడాన్ని గమనించింది. అయితే అప్పటికే శ్యామ్ ప్రసాద్ మృతి చెందాడు. ఈ మేరకు ఫిర్యాదు చేయడంతో పోలీసులు సంఘటనా ప్రాంతానికి వచ్చి శవాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా మార్చురీకి తరలించారు. ఇన్స్‌పెక్టర్ కీసర నాగరాజు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

# జిహెచ్ఎంసి స్టాండింగ్ కమిటీ ఎన్నికల నామినేషన్ల స్వీకరణ

**-ఈనెల 17 వరకు నామినేషన్లు,**
**18న నామినేషన్ల పరిశీలన**
**-కమిటీ ఛైర్మన్‌గా మేయర్**





**హైదరాబాద్, ఫిబ్రవరి 10 ప్రభాతవార్త**

గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ స్టాండింగ్ కమిటీ ఎన్నికల కోసం నామినేషన్ల స్వీకరణ సోమవారం నుంచి ప్రారంభమైంది. అభ్యర్థులు ఈనెల 17వ తేదీ వరకు తమ నామినేషన్ పత్రాలు జిహెచ్ఎంసి కార్యాలయంలో సమర్పించవచ్చు. స్టాండింగ్ కమిటీ ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులు తమ నామినేషన్ పత్రాలను మరో ఇద్దరు కార్పొరేటర్ల మద్దతుతో సమర్పించాలి. నామినేషన్ల స్వీకరణ 17వ తేదీ మధ్యాహ్నం 3 గంటల వరకు కొనసాగుతుంది. నామినేషన్ల పరిశీలనను ఫిబ్రవరి 18న నిర్వహించనున్నారు. ఆ రోజు నామినేషన్ల తుది జాబితాను జిహెచ్ఎంసి ఎన్నికల అధికారి ప్రకటిస్తారు. ఎన్నికలు జరిగితే, 15 స్థానాలున్న స్టాండింగ్ కమిటీకి అత్యధిక మెజార్టీ సాధించిన 15 మంది సభ్యులు ఎంపిక అవుతారు. గత పదేళ్లుగా స్టాండింగ్ కమిటీ ఎన్నికలు ఏకగ్రీవంగా జరుగుతున్నాయి. కానీ, ఈసారి పరిస్థితి భిన్నంగా ఉంది. ప్రస్తుత పరిస్థితుల్లో ఏ పార్టీకి పూర్తి మెజార్టీ లేకపోవడంతో ఈసారి ఎన్నికలు జరిగే అవకాశం ఉంది. ప్రధాన రాజకీయ పార్టీలు ఇప్పటికే స్టాండింగ్ కమిటీ ఎన్నికల కోసం తమ అభ్యర్థులను ప్రకటించేందుకు సిద్ధమవుతున్నాయి. సీక్రెట్ బ్యాలెట్ ద్వారా ఎన్నికలు జరుగుతాయి. కాబట్టి, ఇతర పార్టీ కార్పొరేటర్ల మద్దతు కోసం అభ్యర్థులు లాబీయింగ్ చేపట్టే అవకాశం ఉంది. ఎన్నిక జరిగితే, అత్యధిక మెజార్టీ పొందిన 15 మంది స్టాండింగ్ కమిటీ సభ్యులుగా ఎంపికవుతారు. ఈ కమిటీకి ఛైర్మన్ గా మేయర్ కొనసాగుతారు. స్టాండింగ్ కమిటీ ఎన్నికలు జరిగితే, నగర పాలనపై కీలకమైన ఈ కమిటీ నిర్మాణం రాజకీయ వాతావరణాన్ని వేడెక్కించనుంది. అన్ని పార్టీలు పూర్తి స్థాయిలో ప్రచారం ప్రారంభించి, విజయం సాధించేందుకు కసరత్తు చేయనున్నాయి.

## వేసవిలో నీటి ఎద్దడి తలెత్తకుండా చర్యలు తీసుకోవాలి : సౌందర్య



డ్రైనేజీ, నీటి సమస్యల పరిష్కారంపై జిఎం వినోద్‌కు వినతిపత్రం అందజేస్తున్న అడ్డగుట్ట బిజెపి నేతలు గాజుల సౌందర్య తదితరులు

**అడ్డగుట్ట,ఫిబ్రవరి 10 ప్రభాతవార్త:** అడ్డగుట్ట డివిజన్‌లోని వివిధ ప్రాంతాల్లో నెలకొన్న డ్రైనేజీ, మంచినీటి సమస్యలు పరిష్కరించాలని కోరుతూ సోమవారం అడ్డగుట్ట బిజెపి అధ్యక్షురాలు గాజుల సౌందర్య ఆధ్వర్యంలో జలమండలి జిఎం వినోద్ కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆమె విలేకర్లతో మాట్లాడుతూ వచ్చే వేసవిలో అడ్డగుట్టలో మంచినీటి సమస్య తలెత్తకుండా చూడాలని,అదే విధంగా పాడైన బోర్‌వెల్స్‌కు మరమ్మత్తు చేపట్టాలని,డ్రైనేజీ ఏరులై పారకుండా చర్యలు తీసుకోవాలని తుకారాంగేట్ చౌరస్తా, రియోపాయింట్, సాయి నగర్ పరిసర ప్రాంతాల్లో నూతన మంచినీటి పైప్‌లైన్లు ఏర్పాటు చేయాలని జిఎం దృష్టికి తెచ్చినట్లు ఆమె తెలిపారు.ఈ కార్యక్రమంలో జలమండలి ఏఈ శ్రవంతి, బిజెపి నాయకులు శివలింగం, పి.క్రిష్ణ, హంసరాజ్, రాజేశ్ తదితరులు పాల్గొన్నారు.

## కబీర్‌నగర్ సంక్షేమ సంఘం అధ్యక్షుడిగా జోసఫ్



కబీర్‌నగర్ సంక్షేమ సంఘం అధ్యక్షునిగా ఎన్నికైన జోసఫ్‌కు నియామక పత్రం అందజేస్తున్న ఎన్నికల అధికారి సురేందర్‌గౌడ్.

**యూసుఫ్‌గూడ ఫిబ్రవరి 10, ప్రభాతవార్త :**
ప్రతి రెండు సంవత్సరాల కొకసారి జరిగే బస్తీ ఎన్నికల్లో భాగంగా మోతీనగర్ ప్రాంతంలోని కబీనగర్‌లో సంక్షేమ సంఘం ఎన్నికల్లో ముగ్గురు పోటీచేశారు. బస్తీలో మొత్తం 351 ఓట్లు ఉండగా 347 ఓట్లు పోలయ్యాయి. నాలుగు ఓట్లు చెల్లలేదు. జోషఫ్‌కు 250 ఓట్లు పోలవగా లక్ష్మీనారాయణకు 75 ఓట్లు పోలయ్యాయి మరో అభ్యర్థి నీరజ్‌కుమార్‌కు 22 ఓట్లు పోలయ్యాయి. నూతన అధ్యక్షునిగా గెలుపొందిన జోషఫ్‌కు ఎన్నికల అధికారి సురేందర్‌గౌడ్, అసిస్టెంట్ అధికారి కరణ్‌లు నియామక పత్రాన్ని అందజేశారు.

## ప్రతి మహిళకు శారీరక దృఢత్వం అవసరం : డా. గురవారెడ్డి

**బేగంపేట ఫిబ్రవరి 10,ప్రభాతవార్త**
ప్రతి మహిళకు మానసిక స్థైర్యంతో పాటు శారీరక దృఢత్వం ఎంతో అవసరమని డాక్టర్ ఏ.వీ.గురవారెడ్డి అన్నారు. సోమవారం బేగంపేట లోని ఒ ప్రయివేటు ఆస్పత్రిలో మహిళా ఉద్యోగులు, వైద్యులు,సిబ్బంది కోసం సెల్ఫ్‌డిఫెన్స్ వర్క్‌షాప్ నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజంలో ఇటీవల కాలంలో మహిళలపై జరుగుతున్న దాడులు ఇతరత్రా ఘటనలను దృష్టిలో పెట్టుకుని ప్రతి మహిళ తనను తాను ఆపద సమయంలో కాపాడుకునేందుకు ప్రతి ఒక్కరిలో మానసిక శారీరక దారుఢ్యాన్ని పెంపొందించుకోవాలని అన్నారు.ఇందుకోసమే వర్క్‌షాప్‌ను ప్రారంభించామన్నారు.తమపై ఎవరైనా దాడిచేస్తే ఎలా తప్పించుకోవాలి.ఎలా ప్రతిఘటించాలి అనే విషయాలను వారం రోజుల పాటు బ్యాచ్‌ల వారీగా శిక్షణ తరగతులు నిర్వహించి సర్టిఫికెట్లు అందజేయనున్నారు.

## మేయర్ స్థానం కైవసం కోసం పని చేయాలి

### -రాజ్యసభ సభ్యుడు డాక్టర్ కె.లక్ష్మణ్



క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న రాజ్యసభ సభ్యుడు డాక్టర్ కె.లక్ష్మణ్, చిత్రంలో కార్పొరేటర్ పావనీ వినయకుమార్

**చిక్కడపల్లి, ఫిబ్రవరి 10 ప్రభాతవార్త:**
గాంధీనగర్ డివిజన్ కార్పొరేటర్ పావనీ వినయ్ కుమార్ ఆధ్వర్యంలో రూపొందించిన నూతన సంవత్సర క్యాలెండర్ ఆవిష్కరణ కార్యక్రమం సోమవారం అశోక్‌నగర్‌లో జరిగింది. ముఖ్యఅతిథిగా రాజ్యసభ సభ్యుడు డాక్టర్ కె.లక్ష్మణ్ హాజరై క్యాలెండర్‌ను ఆవిష్కరించి ప్రసంగించారు. బిజెపి నాయకులు, కార్యకర్తలు అనునిత్యం పార్టీ బలోపేతానికి కలిసికట్టుగా కృషి చేయాలని, ఢిల్లీ ఎన్నికలో పార్టీ విజయం నూతనోత్సాహంతో ముందుకు సాగాలన్నారు. త్వరలో జరిగే గ్రేటర్ ఎన్నికల్లో మేయర్ స్థానాన్ని కైవసం చేసుకొని,రానున్న ఎన్నికలలో వరుస విజయాలతో త్వరలో తెలంగాణ రాష్ట్రంలో పార్టీని అధికారంలోకి తేవాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో బిజెపి సికింద్రాబాద్ పార్లమెంట్ జాయింట్ కన్వీనర్ ఎ.వినయ్ కుమార్,ఓబీసీ మోర్చ జాతీయ కార్యవర్గ సభ్యులు పూస రాజు, డివిజన్ అధ్యక్షులు వి.నవీన్ కుమార్, సీనియర్ నాయకులు రత్న సాయి చంద్, శ్రీకాంత్, ఎం.ఉమేష్, శ్రీనివాస్, నర్సింహ, శ్రీనివాస్,ఆనంద్ రావు,యాదగిరి,నీరజ్, సంయుక్త రాణి, కృష్ణవేణి తదితరులు పాల్గొన్నారు.

## న్యూరామారావు నగర్ అధ్యక్షునిగా రామిరెడ్డి గెలుపు



న్యూరామారావు నగర్ సంక్షేమ సంఘం అధ్యక్షునిగా గెలుపొందిన రామిరెడ్డిని అభినందిస్తున్న స్థానికులు.

**యూసుఫ్‌గూడ ఫిబ్రవరి 10, ప్రభాతవార్త :**
అల్లాపూర్ డివిజన్ పరిధిలోని న్యూరామారావునగర్ సంక్షేమ సంఘం ఎన్నికలు నిర్వహించగా కె.రామిరెడ్డి విజయం సాధించారు. ఈ ఎన్నికల్లో కె.రామిరెడ్డి సీలింగ్ ఫ్యాను గుర్తుతో 51 ఓట్లు పోలయ్యాయి. మరో అభ్యర్థి గిరిధర్‌రావు రైజింగ్ సన్ గుర్తుతో పోటీ చేయగా 49 ఓట్లు పోలయ్యాయి. 2 ఓట్ల మెజారిటీతో రామిరెడ్డి అధ్యక్షునిగా గెలుపొందటంతో ఎన్నికల అధికారి పోతు రాజు నరసింగ్‌రావు నియామక పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా రామిరెడ్డి మాట్లాడుతూ నాపై నమ్మకంతో ప్రజలు ఓట్లు వేసి తనను గెలిపించినందుకు కృతజ్ఞతలు తెలిపారు. స్థానిక ఎమ్మెల్యే కృష్ణారావు, కార్పొరేటర్ సబీహా గౌసుద్దీన్ సహకారంతో మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలు చేపడతామని పేర్కొన్నారు.

# వామనాకార బ్నిం కళాప్రక్రియలో బాహుబలి



బ్నింను బుజ్జాసుబ్రహ్మణ్యశాస్త్రి చిత్రలేఖన పురస్కారంతో సత్కరిస్తున్న హనుమంతరావు, రఘురామ్, రామకృష్ణ, భాగిశాస్త్రి తదితర అతిథులు

**రవీంద్రభారతి, ఫిబ్రవరి 10 ప్రభాతవార్త :** బ్నింగా పిలువబడే కళా ప్రపంచానికి చిరపరిచయస్తుడు బి. నరసింహారావు కళా ప్రక్రియలో బహుబలి అని ప్రముఖులు కొనియాడారు. తెలంగాణ ప్రభుత్వం భాషా సాంస్కృతి కశాఖ సౌజన్యంతో బుజ్జా సుబ్రహ్మణ్యశాస్త్రి కళాపీఠం ఆధ్వర్యంలో రవీంద్రభారతిలోని సమావేశ మందిరంలో ప్రఖ్యాత రంగస్థల నటుడు ప్రయోక్త బుజ్జా సుబ్రహ్మణ్య శాస్త్రి 88వ జయంతిని పురస్కరించుకొని మద్దాళి రఘురామ్ సభాధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ ఆచార్య కోట్ల హనుమంతరావు విశిష్ట అతిథులు నంది, కీర్తి పురస్కారాల గ్రహీత శంకు, యక్షగాన కంఠీరవ డా. పసుమర్తి శేషుబాబు, సంస్థ అధ్యక్ష కార్యదర్శులు రేవతి రామకృష్ణ, భాగి శివశంకరశాస్త్రి, సంగీత కళాకారిణి ప్రపుల్లా తదితర ప్రముఖులతో కలిసి ప్రఖ్యాత కార్టూనిస్టు, క్యారికేచరిస్ట్, చిత్రలేఖకుడు, నృత్యరూపక కవి, రచయిత, సెన్సార్ బోర్డు సభ్యుడు కళారత్న బ్నింను ఘనంగా సత్కరించి బుజ్జా సుబ్రహ్మణ్యశాస్త్రి చిత్రలేఖ పురస్కారంతో పాటు నగదు బహుమతిని అందజేసి ఎంతగానో అభినందించి ప్రసంగించారు. సుబ్రహ్మణ్యశాస్త్రి చిత్రకళలో అందెవేసిన చెయ్యే కాకుండా గొప్ప రంగస్థల నటుడుగా ముఖ్యంగా స్త్రీ పాత్రలు ధరిస్తూ నాటకాల్లో పేరుప్రఖ్యాతులు సాధించారన్నారు. ఎన్నో నృత్యరూపకాలకు సాహిత్యం అందించారని వివరించారు. సభకు రామకృష్ణ స్వాగతం పలుకగా భాగిశాస్త్రి నివేదక సమర్పించారు. చివరిగా ప్రముఖ కళాకారులు మల్లాది గోపాలకృష్ణ, బి.ఎల్.పరమేశ్వర్, బి.వెంకటస్వామిలను ఘనంగా చిరుసత్కారం కావించారు. సభకుముందు విద్యార్థుల చిత్రలేఖనం, వైష్ణవి భరతనాట్య ప్రదర్శనలు ఆహుతులను అబ్బురపరిచాయి.

# కెవైసి అప్డేట్ పేరుతో ఒటిపి అడుగుతే ఇవ్వవద్దు

**బేగంపేట ఫిబ్రవరి 10,ప్రభాతవార్త**
కేవైసీ అప్డేట్ పేరుతో మీకు ఓటీపీ వస్తుంది చెప్పండి అంటూ సైబర్ నేరగాళ్ల మోసాలకు పాల్పడుతున్నారని ఇలాంటి వారి పట్ల విధ్యార్థులు ఎంతో అప్రమత్తంగా ఉండాలంటూ మహంకాళీ ఇన్స్‌పెక్టర్ కె.పరుశురాం విధ్యార్థులకు సూచించారు.సోమవారం మహంకాళీ పోలీస్ స్టేషన్ పరిధిలోని ఒ ప్రయివేటు కళాశాలలో మహంకాళీ ఇన్స్‌పెక్టర్ కె.పరుశురాం ఆధ్వర్యంలో ఎస్సై సుబ్రమణ్యం,సైబర్ క్రైమ్ వారియర్ శ్యామ్‌లు విధ్యార్థులకు ప్రస్తుతం జరుగుతున్న సైబర్ నేరాలను గురించి స్కిట్ రూపంలో ప్రదర్శించి విధ్యార్థులకు అవగాహన కల్పించారు.ప్రస్తుతం సైబర్ నేరగాళ్ల బ్యాంకు సిబ్బంది అని చెప్పి పరిచయం చేసుకుని ఫోన్‌లో సంప్రదిస్తూ మీ కేవైసీ అప్డేషన్ చేయాలని,మీకు ఓటీపీ వస్తుంది చెప్పండంటూ తెల్సుకోవడం జరుగుతుందని,బెట్టింగ్ యాప్స్,వాట్సప్, ఇన్స్టాగ్రాం స్నాప్ ఛాట్ టెలిగ్రామ్ యాప్‌లకు లింకులను పంపించి వాటిని క్లిక్ చేయడం ద్వారా వారి అకౌంటు నుంచి సమాచారాన్ని తీసుకోవడంతో పాటు బ్యాంకు అకౌంట్ల నుంచి ఆటోమేటిగ్గా అమౌంట్‌ను కట్ చేసుకుంటారని,అందుకే తెలియని నెంబర్ నుంచి వాట్సప్,



, సైబర్ నేరాలపై విధ్యార్థులకు నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో మాట్లాడుతున్న సీఐ పరుశురాం.

వీడియో కాల్స్ చేయడం,తక్కువ రేట్లకు మొబైల్స్,క్లోత్స్ వెహికిల్స్ అని ఆఫర్లు పెట్టి అమాయకులను మోసం చేయడం జరుగుతుందని,అలాంటి మోసాలపై ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని ఇన్స్‌పెక్టర్ వారికి సూచించారు.ఏదైనా సైబర్ నేరం జరిగినట్లైతే 1930కు కాల్‌చేసి ఏ నెంబర్ నెండి ఈ మెయిల్ గానీ లింకు వచ్చిందో తెలియజేసినట్లైతే వాటిని బ్లాక్ చేసి పోయిన అమౌంట్‌ని ఆపే అవకాశం ఉంటుందని ఆయన తెలియజేసారు.ఈ అవగాహనా కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో విధ్యార్థులు పాల్గొన్నారు.

## 42 బిసి కులాల రిజర్వేషన్లను ఎ,బి,సి,డి వర్గీకరణతో అమలు చేయాలి : వెంకట్

**చిక్కడపల్లి, ఫిబ్రవరి 10 ప్రభాతవార్త:** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించిన కుల గణన లో బిసి కులాల జనాభ దామాషా ప్రకారం స్థానిక సంస్థలకు నిర్వహించబోయే ఎన్నికల్లో ఎ,బి, సి,డి వర్గీకరణతో నిర్వహించాలని బహుజన లెఫ్ట్ పార్టీ (బహుజన కమ్యూనిస్టు) రాష్ట్ర అధ్యక్షులు దండి వెంకట్ డిమాండ్ చేశారు. సోమవారం పార్టీ రాష్ట్ర కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన కుల గణన లో ఎంబిసి కులాల జనాభా లెక్కల వివరాలపై సమగ్ర వివరాలు వెల్లడించాలని డిమాండ్ చేశారు. బిసి (ఎ) జాబితా లోని 68 కులాల జనాభా సర్వే సమగ్రంగా జరుగలేదని ఆయన అన్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం కామారెడ్డి బిసి డిక్లరేషన్ ప్రకారం కుల గణన నిర్వహించి స్థానిక సంస్థల్లో 42 బిసి కులాలకు రిజర్వేషన్ అమలు చేయబోతున్నట్లు కాంగ్రెస్ పార్టీ నాయకత్వంలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించడం పట్ల బహుజన లెఫ్ట్ పార్టీ (బహుజన కమ్యూనిస్టు) బిఎల్పీ రాష్ట్ర కమిటి స్వాగతిస్తుందని, కానీ 42 స్థానిక సంస్థల ఎన్నికల్లో ఎ,బి,సి,డి వర్గీకరణ అమలు చేయకుండా జనరల్ గా బిసి రిజర్వేషన్లు అమలు చేస్తే బిసి (ఎ) జాబితా లో ఉన్న 68 కులాలకు తీవ్రమైన నష్టం వాటిల్లుతుందని దండి వెంకట్



ప్రసంగిస్తున్న బిఎల్పీ రాష్ట్ర అధ్యక్షులు దండి వెంకట్

ఆందోళన వ్యక్తం చేశారు.తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం స్థానిక సంస్థలకు అమలు చేయబోయే 42 బిసి రిజర్వేషన్లను ఎ,బి,సి, డి వర్గీకరణతో నిర్వహించాలని డిమాండ్ చేస్తూ రాష్ట్రవ్యాప్తంగా బహుజన లెఫ్ట్ పార్టీ (బహుజన కమ్యూనిస్టు) బిఎల్పీ ఆధ్వర్యంలో కలిసి వచ్చే రాజకీయ పార్టీలతో, బిసి కులాల మేధావులు, ఇతర సామాజిక న్యాయాన్ని కోరే వారితో కలిసి ఉద్యమిస్తామని తెలిపారు.ఈ కార్యక్రమంలో బహుజన లెఫ్ట్ పార్టీ వ్యవస్థాపక అధ్యక్షులు నల్లా సూర్యప్రకాష్,రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్ సిద్ది రాములు, రాష్ట్ర సహాయ కార్యదర్శి వడ్ల సాయి కృష్ణ, రాష్ట్ర కోశాధికారి మారోజు సునీల్ కుమార్ లు పాల్గొన్నారు.

## క్రమశిక్షణ సేవాదృక్పథానికి మారుపేరు మురళీమోహన్ : నందమూరి రామకృష్ణ

**నాంపల్లి, ఫిబ్రవరి 10 ప్రభాతవార్త :**
క్రమశిక్షణ, అంకితభావం, సేవా దృక్పథానికి మారుపేరు ప్రముఖ సినీనటుడు, నిర్మాత, వ్యాపారవేత్త, మాజీ ఎంపి మాగంటి మురళీమోహన్ అని ప్రముఖ సినీ నిర్మాత నందమూరి రామకృష్ణ అన్నారు. మైహోమ్ అవతార్ సీనియర్ సిటిజెన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ సాంస్కృతిక విభాగం ఆధ్వర్యంలో నిర్వహించిన విశ్వవిఖ్యాత నటుడు ఎన్.టి. రామారావు సినీ వజ్రోత్సవం కార్యక్రమానికి ముఖ్యఅతిదిగా విచ్చేసిన రామకృష్ణ ఎం.మురళీమోహన్‌ను ఘనంగా సత్కరించి ఎన్.టి.రామారావు పేరున నెలకొల్పిన ఎన్టీఆర్ పురస్కారాన్ని ప్రదానంచేసి మాట్లాడారు. తన తండ్రికి ఎన్టీఆర్‌కి మురళీమోహన్‌కి అనేక విషయాలు, ఆశయాల్లో సారూప్యత ఉందని, అందుకే ఈ పురస్కారాన్ని సంపూర్ణంగా అర్హుడని కొనియాడారు. మురళీమోహన్ తన స్పందనలో ఎన్.టి.రామారావు తన అభిమాన ఆరాధ్య నటుడనా, ఆయన పేరిట అవార్డును ఆయన కుమారుని నుండి అందుకోవడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. సభకు ముందు ప్రముఖ సినీ జర్నలిస్టు, సినీవిశారద ఎస్వీ



మురళీమోహన్‌ను ఎన్టీఆర్ పురస్కారంతో సత్కరిస్తున్న రామకృష్ణ, రాధాకృష్ణ, ఎస్వీరామారావు తదితర అతిథులు

రామారావు రూపొందించిన విశ్వవిజేత ఎన్.టి. ఆర్ జీవిత లఘుచిత్రాన్ని ప్రదర్శించారు. ఈ సందర్భంగా డి.ఎ. మిత్రా, శ్రీకాంత్‌లు ఎన్టీ రామారావు సినిమాల్లోని ఆణిముత్యాల్లాంటి పాటలను వీనులవిందుగా ఆలపించి సభికులను తన్మయుల్ని చేశారు. కార్యక్రమాన్ని జె,రాధాకృష్ణ, ప్రసాద్‌రావు తదితరులు నిర్వహించారు.

## పుట్టిన పిల్లలు చనిపోతున్నారాని మనస్థాపానికి గురైన దంపతులు..

### -ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్న భార్య..

**పేట్ బషీరాబాద్, ఫిబ్రవరి 10, ప్రభాతవార్త**
ఆ దంపతులకు వివాహం జరిగి తొమ్మిదేళ్లు కావస్తుంది. ఈ క్రమంలో వారికి మొదటి సంతానం కాగా పుట్టిన నెలరోజులకే అనారోగ్యంతో పసిపాప మృతి చెందింది. కొన్ని రోజుల తర్వాత తిరిగి గర్భం దాల్చిన అనంతరం పుట్టిన పసిబిడ్డ స్వల్ప కాలంలోని మృతి చెందింది. ఇలా పుట్టిన పిల్లలు చనిపోతున్నారని ఆ భర్త మనోవేదనకు గురై మద్యానికి బానిస అయ్యాడు. జీవితంపై విరక్తి చెందిన భార్య ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన పేట్ బషీరాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలో సోమవారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం శ్రీకాకుళం ప్రాంతానికి చెందిన కోదండరాం, దేవి(28)లకు 2015లో వివాహం జరిగింది. వివాహ అనంతరం బతుకుదెరువు కోసం నగరానికి వలస వచ్చి సుభాష్ నగర్ డివిజన్ అద్దె ఇంటిలో ఉంటూ కోదండరాం ఓ ప్రైవేట్ సంస్థ పనిచేసుకుంటు అన్యోన్య కాపురం సాగిస్తున్నారు. ఈ క్రమంలో మొదటిసారి పుట్టిన పసిపాప నెల రోజులు గడవక ముందే అనారోగ్యంతో మృతి చెందింది. మరికొన్ని రోజుల తర్వాత మరో పాపకు జన్మనిచ్చిన అనంతరం మాసం గడవకముందే ఆ పాపకు కూడా అనారోగ్యంతో మృతి చెందింది. ఇలా ఇద్దరు పుట్టిన స్వల్ప కాలంలోనే చనిపోవడంతో భర్త కోదండరాం మానసిక వేదనతో మద్యానికి బానిస అయ్యాడు. పుట్టిన పిల్లలు చనిపోవడంతో పాటు తన భర్త మద్యానికి బానిస కావడంతో జీవితంపై విరక్తి చెంది ఈనెల 9న అర్ధరాత్రి తన భర్త పడుకున్నాక తాము ఉంటున్న రేకుల ఇంట్లో రాడుకు చున్నీతో ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకుంది. పోలీసులు సోమవారం మృతదేహాన్ని గాంధీకి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## విధుల్లో ఉన్న కానిస్టేబుల్‌పై మందుబాబుల దాడి

**హైదరాబాద్, ఫిబ్రవరి 10 ప్రభాతవార్త**
అర్ధరాత్రి విధుల్లో ఉన్న కానిస్టేబుల్‌పై ఇద్దరు యువకులు మద్యం మత్తులో దాడికి పాల్పడ్డారు. ఈ సంఘటన హైదరాబాద్‌లోని జూబ్లీహిల్స్ ప్రాంతంలో జరిగింది. కానిస్టేబుల్ ఫిర్యాదుతో దాడికి పాల్పడిన ఇద్దరిని జూబ్లీహిల్స్ పోలీసులు అరెస్టు చేశారు. దాడికి పాల్పడిన ఇద్దరిలో ఒక యువకుడు బీజేపీ నేత కుమారుడు కావడం విశేషం.జూబ్లీహిల్స్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం, నార్త్ జోన్ టాస్క్ ఫోర్స్ కానిస్టేబుల్ టి.ఈశ్వరరావు శనివారం రాత్రి 12.30 గంటల సమయంలో శ్రీకృష్ణనగర్ సి బ్లాక్‌లో ద్విచక్ర వాహనంపై వెళుతున్నారు. అదే సమయంలో రోడ్డుపై ముగ్గురు యువకులు మద్యం మత్తులో గొడవ పడుతున్నారు. ఈ దృశ్యాన్ని చూసిన కానిస్టేబుల్, వారి వద్దకు వెళ్లి వారించే ప్రయత్నం చేశారు. దీంతో నువ్వు ఎవరు? అంటూ కానిస్టేబుల్ ఈశ్వరరావును ప్రశ్నించారు. అనంతరం కానిస్టేబుల్ అక్కడి నుంచి తన వాహనంపై వెళ్లేందుకు ప్రయత్నించగా శ్రీకృష్ణనగర్‌కు చెందిన బీజేపీ జూబ్లీహిల్స్ నియోజకవర్గ కన్వీనర్ కుమారుడు సాయితేజ, అదే ప్రాంతానికి చెందిన జంగం చెల్లారావు అతడిని అడ్డుకొని గొడవకు దిగారు. ఆయన డయల్ 100కు ఫోన్ చేసేందుకు ప్రయత్నించగా, ఫోన్ లాక్కొని దుర్భాషలాడి దాడికి పాల్పడ్డారు. ఆ తర్వాత ఈశ్వరరావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఇద్దరిపై పోలీసులు కేసు నమోదు చేసుకొని అరెస్టు చేశారు.

# హెచ్‌ఎండిఏ మాస్టర్ ప్లాన్ పునఃసమీక్షించాలి..

**-ఔటర్ లోపలి రైతుల భూములను నివాస జోన్లుగా మార్చాలి**
**-బిజెపి మేడ్చల్ జిల్లా ఇన్‌చార్జి ప్రెసిడెంట్ డా.ఎస్.మల్లారెడ్డి**

**దుండిగల్, ఫిబ్రవరి 10 ప్రభాతవార్త:**
హెచ్‌ఎండిఏ మాస్టర్‌ప్లాన్ వల్ల ప్రణాళిక అభివృద్ధి ఏమోగాని పేదరైతుల పాలిట శాపంగా మారిందని భాజపా మేడ్చల్ జిల్లా ఇన్‌చార్జి ప్రెసిడెంట్, మాజీ రాష్ట్ర ఉపాధ్యక్షులు డా.ఎస్.మల్లారెడ్డి పేర్కొన్నారు. గండిమైసమ్మలో పార్టీ కార్యాలయంలో సోమవారం ఆయన విలేకర్ల సమావేశం ఏర్పాటు చేశారు. ఈసందర్భంగా మల్లారెడ్డి మాట్లాడుతూ హైదరాబాద్ మహానగరంతో పాటు పరిసర ప్రాంతాల అభివృద్ధి కోసం 7257 చ.కి.మీ విస్తీర్ణంతో 2013లో హెచ్‌ఎండిఏ మాస్టర్ ప్లాన్ రూపొందించిందన్నారు. ప్రస్తుతం హెచ్‌ఎండిఏ పరిధిలోన 70మండలాలు, 24మున్సిపాలిటీలు, 8మున్సిపల్ కార్పొరేషన్లు, సుమారు 750 గ్రామాలు ఉన్నాయి. మాస్టర్ ప్లాన్‌లో భూములను కన్జర్వేషన్ (వ్యవసాయం), పబ్లిక్–సెమి పబ్లిక్, రిక్రియేషన్, ఓపెన్‌స్పేస్, ట్రాఫిక్, రవాణా, పెరి అర్బన్, రెసిడెన్షియల్, కమర్షియల్, ఇండస్ట్రియల్, మల్టిపుల్ తదితర జోన్లుగా విభజించారు. అయితే సన్న, చిన్నకారు రైతుల భూములను ఇండ్ల నిర్మాణాలకు అవకాశం లేకుండా కన్జర్వేషన్‌లో జోన్లో చేర్చారు. దీంతో సమగ్రంగా వివరిస్తూ 2013లో నాటి ముఖ్యమంత్రి కిరణ్ కుమార్‌రెడ్డిని కలిసి ఫిర్యాదు చేశామన్నారు. 11సంవత్సరాల నుండి జోన్ల మార్పు జరగకపోవడం రైతులు నష్టపోతున్నారు. తమ సొంత భూములలో నివాసాలు నిర్మించుకునే పరిస్థితి లేకుండా పోయిందన్నారు. కన్జర్వేషన్ జోన్ సమస్య వలన సుమారు 50వేల మంది రైతులు ఇబ్బందులు పడు



సమావేశంలో మాట్లాడుతున్న డా.ఎస్.మల్లారెడ్డి

తున్నట్లు తెలిపారు. రైతుల ప్రయోజనాలకు వ్యతిరేకంగా ఉన్న మాస్టర్ ప్లాన్‌ను తక్షణమే మార్పు చేయవలసిన అవసరం ఉందంటూ పలు డిమాండ్లను తెలిపారు. ప్రధానంగా హెచ్‌ఎండిఏ మాస్టర్ ప్లాన్ పునఃసమీక్షించి రైతులకు అనుగుణంగా జోన్లను నిర్ణయించాలి. రింగురోడ్డు లోపల ఉన్న రైతుల భూములన్నింటిని రెసిడెన్షియల్(నివాస) జోన్‌గా మార్చాలి. రింగురోడ్డు వెలుపల ఉన్న ప్రతి రైతులకు 5 ఎకరాల వరకు జోన్లు మార్చుకునే అవకాశం కల్పించాలి. జోన్ల మార్పిడి సులభతరం చేయాలి. రింగురోడ్డును అనుకొని భూములకు సర్వీస్‌రోడ్డుతో అనుసంధానించే అవకాశం ఇవ్వాలి. నిర్మాణ అనుమతుల ప్రక్రియను వేగవంతం చేయడంతో ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో పొందుపరించాలి. ఇట్టి డిమాండ్లను ప్రభుత్వం వెంటనే నేరవేర్చాలి. లేని పక్షంలో రైతులందరితో కలిసి భాజపా ఆధ్వర్యంలో ఉద్యమాన్ని మొదలుపెడుతామని స్పష్టం చేశారు. సమావేశంలో జిల్లా ప్రధానకార్యదర్శి విఘ్నేశ్వరచారి, జిల్లా కిసాన్‌మోర్చా అధ్యక్షులు మల్లారెడ్డి, జిల్లా కౌన్సిల్ సభ్యులు మల్లేష్‌యాదవ్, దుండిగల్ మున్సిపల్ అధ్యక్షులు పీసరి క్రిష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## హెబ్రోను చర్చిలో ప్రశాంత వాతావరణంలో ప్రార్థనలు

**చిక్కడపల్లి, ఫిబ్రవరి 10 ప్రభాతవార్త:** గోల్కొండ చౌరస్తాలోని హెబ్రోను చర్చిలో ప్రశాంత వాతావరణంలో ప్రార్థనలు జరిగాయి. హెబ్రోను చర్చిలోను దాని అనుబంధ సంఘాలలో సొసైటీ, ట్రస్ట్ మధ్య ఎన్నో సంవత్సరాలుగా నెలకొన్న వివాదాలకు ముగింపు పలుకుతూ ఇరువురు కలిసిపోవడం గమనార్హం. గత ఐదు నెలలుగా చర్చిలో నెలకొన్న పలు వివాదాలకు కారణమైన డి.రాజేశ్వరరావు కొందరు స్థానిక వ్యక్తులతో కలసి భక్తుల కానుకలైన సుమారు కోటి యాభై లక్షల రూపాయలకు ఎటువంటి ఎకౌంటు లేకుండా చేశారు. అయితే భక్తులు వేసిన కానుకలను ప్రస్తుత కమిటీ వారు బ్యాంకు ఎకౌంట్లో జమ చేశారు. చర్చి తలుపులు తెరిచే ఉంటాయని, హెబ్రోను చర్చికి తాళాలు వేశారనే తప్పుడు ప్రచారాన్ని నమ్మవద్దని పలువురు తెలిపారు. కాగా హెబ్రోన్ లో తిరిగి ప్రశాంత వాతావరణంలో ప్రార్థనలు జరగడానికి సహకరించిన ప్రతి ఒక్కరికి చర్చిలోని సొసైటీ మరియు ట్రస్ట్ కమిటీ ప్రతినిధులు రాగి వీరాచారి, ఎం.ఇమ్మానియేల్ కృతజ్ఞతలు తెలిపారు.

## కెరీర్ ప్లానింగ్ పై నైపుణ్య శిక్షణ సదస్సు

**చిక్కడపల్లి, ఫిబ్రవరి 10 ప్రభాతవార్త:** వివేకానంద ప్రభుత్వ డిగ్రీ కళాశాల(విద్యానగర్)లో టీఎస్‌కేసి టాస్క్ సంయుక్త ఆధ్వర్యంలో "కెరీర్ ప్లానింగ్ ఇంటర్వ్యూ టెక్నిక్స్, రెజ్యూమ్ బిల్డింగ్"అనే అంశంపై నైపుణ్య శిక్షణ సదస్సు ప్రిన్సిపల్ డా. కె. ప్రభు అధ్యక్షతన జరిగింది. ప్రిన్సిపల్ డా.కె.ప్రభు మాట్లాడుతూ సరైన రెజ్యూమ్, ఇంటర్వ్యూ టెక్నిక్స్‌తోనే ఈ పోటీ ప్రపంచంలో ఉన్నత ఉద్యోగం సాధించగలరన్నారు. ఈ సదస్సులో ముఖ్యవక్తగా పాల్గొన్న కేంటి లివర్ ల్యాబ్స్ హైదరాబాద్ రీజనల్ బిజినెస్ హెడ్ లీలా సాయిదేవ్ మాట్లాడుతూ విద్యార్థులకు రెజ్యూమ్ బిల్డింగ్ లోని ముఖ్య అంశాలను, ఇంటర్వ్యూలో నెగ్గడానికి మెలకువలను శిక్షణ సదస్సులో బోధించారు. ఈ సదస్సులో టాస్క్ కోఆర్డినేటర్ డా.ఆర్. లావణ్య, కోఆర్డినేటర్ డా. పి. పద్మజ, మేనేజ్మెంట్ విభాగాధిపతి సంతోషి, ప్రవీణ విద్యార్థులు పాల్గొన్నారు.

## బిసిలకు 42 శాతం రిజర్వేషన్‌లు కల్పించాలి

**సైఫాబాద్, ఫిబ్రవరి 10 ప్రభాతవార్త:**
రాష్ట్ర ప్రభుత్వం బిసిలకు స్థానిక సంస్థల్లో 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ చట్టం తీసుకురావాలని భారత జాతీయ లోక్‌దళ్ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పి.వెంకటరాజేశ్వర్ రావు డిమాండ్ చేశారు. రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య బిసిల రిజర్వేషన్‌ల కోసం చేస్తున్న పోరాటానికి తమ పార్టీ మద్దతు ఉంటుందని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన కులగణన తప్పుల తడకగా ఉందని, బిసిల జనాభా తక్కువ గా చూపించిదని ఆరోపించారు. కా ంగ్రెస్ పార్టీ ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయాలని, లేని పక్షంలో ఢిల్లీ కాంగ్రెస్‌కు పట్టిన గతే ఇక్కడ పడుతుందని ఆయన హెచ్చరించారు.




సోమవారం సోమాజీగూడ ప్రెస్‌క్లబ్‌లో జరిగిన హోలియ దాసరి సంఘ సమావేశంలో పాల్గొన్న మంద కృష్ణ మాదిగ

### నక్సలిజం లేకుండా చేస్తామని

### అమిత్‌షా ప్రకటించడం, కార్పొరేట్ శక్తులకు దోచిపెట్టడమే

**సైఫాబాద్, ఫిబ్రవరి 10 ప్రభాతవార్త:** వచ్చే ఏడాది మార్చి 31 నాటికి దేశంలో నక్సలిజం లేకుండా చేస్తామని కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్‌షా ఇటీవల ప్రకటించడమంటే కార్పొరేట్ దోపిడీ శక్తుల మెప్పుకోసమేనని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు బి.ఎస్.బోస్ ఆరోపించారు. దేశంలో పీడిత ప్రజలపై కొనసాగుతున్న అణిచివేత, పీడన, వివక్ష, దోపిడీ ఉన్నంత కాలం ఉద్యమాలు, పోరాటాలు కొనసాగుతాయని, సమాజంలో సామాజిక, ఆర్థిక, రాజకీయ రంగాల్లో మార్పులు రాకుండా ఒక్క నక్సలైట్ భావజాలాన్ని లేకుండా చేయడం అసాధ్యమని సోమవారం నాడిక్కడ పత్రికలకు విడుదల చేసిన ఒక ఆయన ప్రకటనలో పేర్కొన్నారు. గతంలో పాలకులు కమ్యూనిస్టు పార్టీలను, నక్సలైట్ల పార్టీలను లేకుండా చేస్తామని ప్రగల్భాలు పలికి చివరికి వారే అధికారం కోల్పోయారని చెప్పారు. మధ్య భారతం అడివీలో ఉన్న ప్రకృతి సంపదను కార్పొరేట్ సంస్థల ప్రయోజనాల కోసం ప్రజలను అక్కడ నుంచి బయటకు వెళ్లగొట్టి సంపదను దోచుకోవాలనేది అమిత్‌షా ఆలోచన అని ఆయన విమర్శించారు. అంతర్జాతీయ న్యాయ సుత్రాలకు విరుద్ధంగా తక్షణమే సు ప్రీంకోర్టు జోక్యం చేసుకుని దండకారణ్య ప్రాంతంలో జరుగుతున్న మారణ హోమాన్ని ఆపివేసి, సైనిక బలగాలను అక్కడి నుంచి ఉపసంహరించుకునేలా కేంద్ర ప్రభుత్వాన్ని ఆదేశించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

## ముగ్ధమనోహరం మేఘ్న కూచిపూడి రంగప్రవేశం

**రవీంద్రభారతి, ఫిబ్రవరి 10 ప్రభాతవార్త :** శ్రీసాయి నటరాజ అకాడమీ ఆఫ్ కూచిపూడి డ్యాన్స్ ఆధ్వర్యంలో రవీంద్రభారతి ప్రధాన మందిరంలో ప్రఖ్యాత నాట్యగురువు కళాశ్రీ డా. పి.రమాదేవి శిష్యురాలు జి.మేఘ్న కూచిపూడి రంగప్రవేశం ముగ్ధమనోహరం నేత్రపర్వంగా సాగింది. మేఘ్న తన కూచిపూడి రంగప్రవేశాన్ని ముందుగా గౌళరాగం, మిశ్రచాపుతాళంలో ముత్తుస్వామి దీక్షితులవారి శ్రీ మహాగణపతి రవతుమమం అంశంతో ప్రారంభించి సరసిజనభ సోదరి; వింతలు వింటివ యశోద; శంకర శ్రీగిరి నందప్రభోకే; మాధవ మమవ దేవ; తత్తరపడనేల జావళి; చివరిగా పూర్వరాగం రూపకతాళంలో తిల్లానా అంశాలను శృతి లయబద్ధంగా అద్భుత హావభావాలను ప్రదర్శిస్తూ అద్భుతంగా నర్తించి సభికులను మంత్రముగ్ధులను చేసింది. గురు డా. పి.రమాదేవి నట్టువాంగం, ఐ.వి.రేణుకాప్రసాద్ మృదంగం, స్వేత ప్రసాద్ గాత్రం, కోలంక సాయికుమార్ వయోలిన్, ఉమావెంకటేశ్వర్లు వేణువులతో అద్భుత వాద్యసహకారం అందించి మేఘ్న కూచిపూడి రంగప్రవేశాన్ని మరింత రక్తికట్టించారు. మేఘ్న కంప్యూటర్ సైన్స్‌లో డిగ్రీతోపాటు పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం నుండి కూచిపూడిలో అత్యుత్తమ శ్రేణుల్లో సర్టిఫికెట్, డిప్లొమా, ఎంఎ మాస్టర్ పట్టా పొందడం విశేషం.



సోమవారం సోమాజీగూడ ప్రెస్‌క్లబ్‌లో మున్నూరుకాపు అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో పాల్గొన్న తెలంగాణ మున్నూరు కాపు సంఘం రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ కొండ దేవయ్య పటేల్, తెలంగాణ మున్నూరు కాపు సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ చల్లా హరిశంకర్

## కాంగ్రెస్‌తోనే అభివృద్ధి సాధ్యం : ఒబేదుల్లా కొత్వాల్

**చార్మినార్,ఫిబ్రవరి 10 ప్రభాతవార్త :**
కాంగ్రెస్‌తోనే అభివృద్ధి సాధ్యమవుతుందని ,రాష్ట్రంలోని అన్ని వర్గాల ప్రజల అభ్యున్నతి కోసం ప్రభుత్వం పాటు పడుతున్నదని తెలంగాణ రాష్ట్ర మైనార్టీ కార్పొరేషన్ చైర్మన్ ఒబేదుల్లా కొత్వాల్ అన్నారు.హైదరాబాద్ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు వలీ ఉల్లా షరీఫ్ ఆధ్వర్యంలో పాతబస్తీ కిల్వత్‌లోని ఉర్దూ మస్కాన్‌లో ప్రభుత్వం ఇటీవల ప్రకటించిన బిసి కుల గణనపై సమావేశం జరిగింది. హైదరాబాద్ జిల్లాలోని బదూర్‌పుర, చార్మినార్,చాంద్రాయణగుట్ట ,కార్వాన్, మలక్‌పేట్,యాకుత్‌పుర అసెంబ్లీ నియోజకవర్గాల కాంగ్రెస్ పార్టీల ఇంఛార్జిలు పులిపాటి రాజేష్ కుమార్,ముజీబుల్లా షరీఫ్,బోయ నగేష్,ఉస్మాన్ అల్ హజిరీ,షేక్ అక్బర్,కె. రవిరాజ్‌లు సమావేశంలో మాట్లాడుతూ రాహుల్ గాంధీ ఆదేశాలనుసారం కుల గణన సర్వేను రాష్ట్ర ప్రభుత్వం సంకల్పంతో పూర్తి చేసిందని,కుల గణన సర్వే దేశానికే ఆదర్శంగా చేపట్టడం జరిగిందన్నారు.పాతబస్తీలో కాంగ్రెస్ పార్టీ కోసం ఎన్నో ఏళ్ల నుంచి పని చేస్తున్న సీనియర్ కాంగ్రెస్ నాయకులకు నామినేటెడ్ పదవులతో పాటు పార్టీ పదవులతో కూడ సముచితమైన స్థానం కల్పించాలని పలువురు సీనియర్ కాంగ్రెస్ నాయకులు పార్టీ అధిష్టానాన్ని కోరారు.కార్యక్రమానికి ముఖ్య అతిధిగా విచ్చేసిన రాష్ట్ర మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్,హైదరాబాద్ జిల్లా కాంగ్రెస్ ఇంఛార్జి ఒబేదుల్లా కొత్వాల్ మాట్లాడుతూ ..కాంగ్రెస్‌తోనే అభివృద్ధి సాధ్యమవుతుందని తెలిపారు. రాష్ట్రాన్ని పది సంవత్సరాలు పాలించిన బిఆర్ఎస్ పాలనలో ఎటువంటి అభివృద్ధి జరగలేదని ఆయన తెలియజేశారు.పాతనగరంలో కాంగ్రెస్ పార్టీని మరింత బలోపేతం చేయటానికి నాయకులు కార్యకర్తలు సమిష్టిగా కృషి చేయాలని ఆయన కోరారు. ఈ సమావేశంలో సీనియర్ కాంగ్రెస్ నాయకులు ఎస్.కె. అఫ్జల్, జి.కన్నయ్య లాల్,వెంకటేష్ ముదిరాజ్,కె.వెంకటేష్,మూసాకాశిం,శ్యాంరావు ముదిరాజ్,అలీ అస్గర్,రజా అలీ మీర్జా.తిరుపతి,చంద్రశేఖర్,సురేష్ బాబు,థానీస్,మహ్మద్ అస్లాం, భాను చందర్ యాదవ్,శశి యాదవన,సయ్యద్ ఇక్బాల్,మహ్మద్ జబ్బార్ పాల్గొన్నారు.




సమావేశంలో మాట్లాడుతున్న రాష్ట్ర మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ ఒబేదుల్లా కొత్వాల్

**Summons**

**IN THE COURT OF THE III ADDITIONAL DISRTICT JUDGE RANGA REDDY DISRTICT AT : L.B NAGAR**

**O.S.No. 127 of 2022**

Between: -
Bharathamma @Yeshodha& others
....Petitioner/Plaintiff
AND
Amarnath & others
....Respondent/Defendants

To,
Nageshwar Rao S/o DurgaBai, Aged about ; 45 Years , Occu : employee R/o 18-2-345, jangamet, falaknuma , Hyderabad. ...Defendant No. 5

Please take notice that the above named plaintiffs filed suit vide O S No 127 of 2022 on the file of Honble III additional district judge Ranga reddy district , and same is posted on 17-02-2025 at 10.30 A.M for appearance and counter . Therefore it is requested that if any person or person having any objection in the above suit are hereby requested to make appearance either in person or through advocate duly instructed on 17-02-2025 at 10.30 A.M. before the above said honble court, failing which the matter will be heard in their absence .

**By order of the court**
**Sri L.K. SHARMA**
**Advocate**

## అనాథ పిల్లలను విద్యావంతులుగా తీర్చిదిద్దాలి

**- ఎమ్మెల్యే శ్రీగణేష్**



రెజిమెంటల్ బజార్‌లోని ఆశ్రయ్ హోం సెంటర్‌ను సందర్శించిన ఎమ్మెల్యే శ్రీగణేష్ తదితరులు

**అడ్డగుట్ట,ఫిబ్రవరి 10 ప్రభాతవార్త:** అనాథ పిల్లలను హక్కున చేర్చుకొని విద్యాబోధన అందించడంతో పాటు తగిన వసతి సౌకర్యాలు ఏర్పాటు చేసిన ఆశ్రయ్ హోమ్ స్వచ్ఛంద సంస్థను కంటోన్మెంట్ ఎమ్మెల్యే ఎన్.శ్రీగణేష్ అభినందించారు. సికింద్రాబాద్ రెజిమెంటల్ బజార్‌లోని హిల్ స్ట్రీట్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రాంగణంలో కొనసాగుతున్న ఆశ్రయ్ అనాథ సెంటర్‌ను ఆయన సందర్శించారు. ఆ సెంటర్‌లో నెలకొన్న సమస్యలు, విద్యార్థినీలు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనాథ పిల్లలకు ఉచితంగా ఆశ్రయ్ హోమ్ సంస్థ ఆధ్వర్యంలో వంద మంది బాలికలకు ఉచిత వసతి భోజనం కల్పిస్తున్నామని, విద్యుత్ బిల్లులు అధికంగా వస్తున్నాయని నిర్వాహకురాలు గ్రేస్‌మని ఎమ్మెల్యే దృష్టికి తెచ్చారు. ఎమ్మెల్యే శ్రీగణేష్ ప్రభుత్వం సహకరిస్తే హోల్డేజ్ హోం, బాలుర వసతి గృహాన్ని కూడా ఏర్పాటు చేస్తామని ఎమ్మెల్యేకు విజ్ఞప్తి చేశారు. హాస్టల్‌లో విద్యుత్, సోలాలర్ సిస్టమ్, అదనపు గదులకు కేటాయించాలని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టితో ఫోన్‌లో మాట్లాడి హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సీనియర్ కాంగ్రెస్ నేత చిర్రబోయిన సంతోష్ యాదవ్, ఆర్.డి.నాగేశ్ యాదవ్, రాంమోహన్, అరవింద్ యాదవ్, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

### విద్యార్థులు సమాజ అభివృద్ధికి పాటుపడాలి : కమాండర్ చక్రవర్తి



బోయిన్‌పల్లి సెయింట్ ఫీటర్స్ హైస్కూల్‌లో గ్రాడ్యుయేషన్ వేడుకలు

**కంటోన్మెంట్,ఫిబ్రవరి 10 ప్రభాతవార్త:** విద్యార్థులు విద్యాపరంగా అభివృద్ధి చెంది సమాజాభివృద్ధి కోసం పాటుపడాలని తెలంగాణ తెలంగాణ ఎయిర్‌ఫోర్స్ వింగ్ కమాండర్ చక్రవర్తి, పాఠశాల పౌండర్ చైర్మన్ బాల్ రెడ్డిలు తెలిపారు. బోయిన్‌పల్లిలోని సెయింట్ ఫీటర్స్ హై స్కూల్‌లో జరిగిన గ్రాడ్యుయేషన్ వేడుకలు ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. పోటీ ప్రపంచంలో విద్యార్థులు విద్యాపరంగా అభివృద్ధి చెంది ఉన్నత శిఖరాలు అధిరోహించాలన్నారు. ఈ సందర్భంగా 10వ తరగతి విద్యార్థుల గ్రాడ్యుయేషన్ వేడుకలు పాఠశాల కరస్పాండెంట్ టీ.ఏ.రెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సువర్ణలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా 10వ తరగతి విద్యార్థులకు పట్టాలు, ధృవీకరణ పత్రాలు అందజేశారు. అనంతరం విద్యార్థిని విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక నృత్యాలు పలువురిని అలరించాయి.

## కార్పొరేటర్ మార్తా వాణి ప్రసాద్‌కు సత్కారం



కార్పొరేటర్ మార్తా వాణి ప్రసాద్‌ను సన్మానిస్తున్న సభ్యులు

**నిజాంపేట్, ఫిబ్రవరి 10, ప్రభాతవార్త**

లేక్ వ్యూ కాలనీవాసులు, అంబీర్ లేక్ వాకర్స్ అసోసియేషన్, మైత్రి లేక్ వ్యూ అపార్ట్మెంట్ సభ్యులు నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ 6వ మాజీ కార్పొరేటర్ మార్తా వాణి ప్రసాద్ సేవలకుగాను సోమవారం ఘన సన్మానం చేసి అభినందన సభ ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో మార్తా వాణి ప్రసాద్ మాట్లాడుతూ కాలనీలో నెలకొన్న ప్రతి సమస్యను ప్రజలు తన దృష్టికి తీసుకురాగానే వెంటనే సంబంధిత అధికారులతో చర్చించి ఎప్పటికప్పుడు ఆ సమస్యల పరిష్కారానికి శాశ్వత పరిష్కారం చూపేందుకు నిరంతరం కృషి చేస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో రమేష్, మైత్రి అసోసియేషన్ సంజయ్, ఇండియా లింక్ వ్యూ ఫ్రెంట్ రేవతి, హరిబాబు, కాంగ్రెస్ పార్టీ లీడర్ మధుసూదన్ రెడ్డి, టిఆర్ఎస్ పార్టీ లీడర్ జస్వంత్ పాల్గొనడం జరిగింది.

## లంగర్ హౌస్‌లో ట్రాఫిక్ పోలీసుల స్పెషల్ డ్రైవ్



కారుకు బ్లాక్ ఫిలిం ను తొలగిస్తున్న ఇన్ స్పెక్టర్ అంజయ్య

**మెహిదీపట్నం, ఫిబ్రవరి 10, ప్రభాతవార్త :**

ట్రాఫిక్ నియమ నిబంధనలను వాహనదారులు పాటించే విధంగా ట్రాఫిక్ పోలీసులు నిత్యం చర్యలు తీసుకుంటున్నారు. అందులో భాగంగా ట్రాఫిక్ పోలీసులు కార్ల అద్దాలకు బ్లాక్ ఫిలింలను, సైరన్ లను హారన్ లుగా వాడుతున్న కార్లపై చర్యలు తీసుకుంటున్నారు. లంగర్ హౌస్ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ ఇన్ స్పెక్టర్ అంజయ్య ఆధ్వర్యంలో సోమవారం లంగర్ హౌస్ బాపు ఘాట్ రింగ్ రోడ్డు ప్రాంతంలో కార్ల అద్దాలకు బ్లాక్ ఫిలిం లతోపాటు హారన్ లను సైతం తొలగించారు. అనంతరం ఇన్ స్పెక్టర్ అంజయ్య మాట్లాడుతూ.. లంగర్ హౌస్ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ పరిధిలో నిత్యం స్పెషల్ డ్రైవ్ లను నిర్వహిస్తూ ట్రాఫిక్ నిబంధనలకు విరుద్ధంగా నడుస్తున్న వాహనాలపై చర్యలు తీసుకోవడం తో పాటు వాహనదారులపై కేసులు కూడా నమోదు చేస్తున్నామని తెలిపారు. ప్రతి వాహనదారుడు ట్రాఫిక్ నియమ నిబంధనలను పాటిస్తూ వాహనాలను నడపాలని కోరారు.

## ప్రజాఏక్తా పార్టీ ఎమ్మెల్సీ అభ్యర్థిగా నాగరాజు



నాగరాజుకు బి.ఫాం అందచేస్తున్న జాతీయ అధ్యక్షులు బోనాల శ్రీనివాస్‌గుప్త

**బేగంబజార్,ఫిబ్రవరి 10 ప్రభాతవార్త:** ఖమ్మం, నల్గొండ, వరంగల్ టిచర్ నియోజకవర్గం ప్రజా ఏక్తా పార్టీ అభ్యర్థిగా బొడ్డు నాగరాజును ప్రజా ఏక్తా పార్టీ జాతీయ అధ్యక్షులు బోనాల శ్రీనివాస్‌గుప్త ప్రకటించారు. ఆదివారం గౌలిగూడపార్టీ కార్యాలయంలో బోడ్డునాగరాజుకు ఆ ఫార్టీ బిఫాంను నాగరాజును అందచేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ మూడు నియోకవర్గాలల్లో ఉన్న ఉపాధ్యాయులు ప్రజాఏక్తాపార్టీ ఉపాధ్యాయ అభ్యర్థికి ఓటు వేసి గెలిపించాలని పిలుపునిచ్చారు.

## ప్రభుత్వ భూమి కబ్జాపై పార్టీలకతీతంగా ఫిర్యాదు..

**నిజాంపేట్, ఫిబ్రవరి 10, ప్రభాతవార్త**

సర్వేనెంబర్ 233/21, నిజాంపేట్ కాలనీ శివాలయం పక్కనే ప్రభుత్వ భూమి 1100 గజాల ప్రభుత్వ భూమిని ఆక్రమించుకొని అక్రమ నిర్మాణం చేసుకున్న సంఘటనపై ఎమ్మార్వో సరైన విధంగా స్పందించకపోవడంతో సోమవారం పార్టీలకతీతంగా పలువురు ప్రజాప్రతినిధులు ఫిర్యాదు చేశారు. ప్రభుత్వ భూముల్లో నిర్మించిన అక్రమ నిర్మాణం కూల్చివేసి కబ్జాదారుడుపై క్రిమినల్ కేసు నమోదు చేయాలని నిజాంపేట్ మాజీ మేయర్ నీల గోపాల్ రెడ్డి, ఆకుల సతీష్, కాలనీ ప్రజలు, వివిధ పార్టీల సీనియర్ నాయకులతో కలిసి కలెక్టర్‌కు, అడిషనల్ కలెక్టర్‌కి ఫిర్యాదు చేయడం జరిగింది. అదే విధంగా నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో నిజాంపేట్ డంపింగ్ యార్డ్, ప్రగతి నగర్ డంపింగ్ యార్డ్ స్థలాలు, కార్పొరేషన్ పరిధిలో ప్రభుత్వ స్థలాలను కబ్జాలకు గురి కాకుండా చర్యలు తీసుకోవాలని రాజకీయ పార్టీలకు



ఫిర్యాదు చేసిన ప్రజాప్రతినిధులు

అతీతంగా మాజీ మేయర్ కోలన్ నీలా గోపాల్ రెడ్డి ఆధ్వర్యంలో ప్రజా ప్రతినిధులు, నాయకులతో కలసి కలెక్టర్‌కి ఫిర్యాదు చేయడం జరిగింది. అదే విధంగా ప్రజాప్రతినిధులు, నాయకులు కార్పొరేషన్ పరిధిలో భూ కబ్జాలకు గురి కాకుండా పార్టీలకతీతంగా ఆయా పార్టీల నాయకులు కలిసి ముందుకు రావాలని మాజీ మేయర్ తెలియజేశారు.

## భారతీయ నృత్యాంశాలు సనాతన ధర్మానికి ప్రతీకలు

**-మాజీ కేంద్ర మంత్రి డాక్టర్ సముద్రాల వేణుగోపాలాచారి**

**చిక్కడపల్లి, ఫిబ్రవరి 10 ప్రభాతవార్త:** భారతీయ నృత్యాంశాలు సనాతన ధర్మానికి ప్రతీకలుగా నిలుస్తాయని మాజీ కేంద్ర మంత్రి డాక్టర్ సముద్రాల వేణుగోపాలాచారి అన్నారు. ఆకాంక్ష చారిటబుల్ ట్రస్ట్ అధినేత్రి పాలపర్తి సంద్యారాణి, శ్రీ లాస్య నృత్యాలయ సంయుక్త ఆధ్వర్యంలో భరత నాట్య నృత్య ప్రదర్శన సోమవారం నల్లకుంట శంకర మఠంలో జరిగింది. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా యువకళావాహిని అధ్యక్షుడు లంకా లక్ష్మీనారాయణ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా డాక్టర్ సముద్రాల వేణుగోపాలాచారి హాజరై అద్భుతమైన నృత్యప్రదర్శన చేసిన కళాకారులను సత్కరించి అభినందించారు. మారుతున్న కాలానుగుణంగా ఇటువంటి కళలలో శిక్షణ ఇవ్వడంతో పాటు ధైర్య సాహసాలు కూడా అత్యవసరమని, కళా ప్రదర్శనలలో సంస్కారం ఉట్టిపడుతుందని అందుకు సహకరిస్తున్న అందరికీ అభినందించారు. ప్రముఖ నాట్య గురువు విశాఖ ప్రకాష్ శిష్యురాళ్లు భరత నాట్యాంశాలను ప్రదర్శించి అందరి నుంచి ప్రశంసలు అందుకున్నారు. ఈ సభలో ప్రముఖ న్యాయవాది శ్రీమతి కలగా పార్వతి, బుర్ర మోహన కృష్ణ వ్యాఖ్యాతగా



నృత్యకళాకారులను సత్కరించిన దృశ్యం

వ్యవహరించారు. భరతనాట్యం కార్యక్రమంలో భాగంగా శ్లోకాంజలి ,గౌడ రాగం, మల్హరి, రాగాంశాలతో పాటుగా సరసవాణి, సరస్వతి, నటేష నవకం, దుర్గాదేవి, కళ్యాణి ,గీర్వాణి నక్షత్రమాలిక, గోవిందా హరి గోవిందా ,సంగీత సామ్రాజ్యం వంటి అంశాలను నయనానంద భరితంగా ప్రదర్శించారు. కళాకారులు దృహిత ,దుర్గ ,తాన్వి, హర్షిని, అక్షయ, సంకీర్తన, ప్రణవి ,మేధ, ఆద్య, అనఘ, మహతి ,శ్రియ, కార్తీక ,శ్రీహిత ,నయన ,రిధీమా,చక్కని హావాభావాలు ప్రదర్శించి అందరి మన్ననలు అందుకున్నారు కన్వీనర్ రఘు శ్రీ సభ సమన్వయం గావించారు.

### వెంకటేశ్వర స్వామి ఆలయ నిర్మాణానికి విరాళాలు..



ఆలయ కమిటీ సభ్యులకు విరాళాన్ని అందజేస్తున్న దాతలు

**నిజాంపేట్, ఫిబ్రవరి 10, ప్రభాతవార్త**

కుత్బుల్లాపూర్ నియోజకవర్గం నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని మధురనగర్ కాలనీలో అష్టలక్ష్మీ సమేత శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయ భవన నిర్మాణానికి తన వంతు సహాయంగా నిజాంపేట్ గోకుల్ కన్స్ట్రక్షన్ ప్రొప్రైటర్లు మధుసూదన్ రెడ్డి, తిరుపాలయ్యలు రూ.51,000 అష్టలక్ష్మీ సమేత శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయ కమిటీ సభ్యులు జి. విష్ణువర్ధన్ రెడ్డి, పి.రాంబాబు, సిహెచ్ లింగ య్య, మాజీ డిప్యూటీ మేయర్ ధనరాజ్ యాదవ్ లకు అందజేశారు.

**మరోదాత విరాళం..**

కుత్బుల్లాపూర్ నియోజకవర్గం నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని మధురనగర్ కాలనీలో అష్టలక్ష్మీ సమేత శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయ నిర్మాణానికి మరో దాత ప్రగతినగర్ రుద్ర కన్స్ట్రక్షన్స్ పల్లెంపాటి నవీన్ రూ.1,00,000 తన వంతు సహాయంగా ఆలయ కమిటీ సభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు దాతలకు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు.

### క్రీడలను ప్రభుత్వం ప్రోత్సహిస్తుంది : శివసేన రెడ్డి



కుస్తీ పోటీల్లో గెలుపొందిన వారిని అభినందిస్తున్న శివసేన రెడ్డి, మెట్టు సాయి కుమార్.

**మెహిదీపట్నం, ఫిబ్రవరి 10, ప్రభాతవార్త :**

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం క్రీడలను ప్రోత్సహిస్తుందని రాష్ట్ర స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివసేన రెడ్డి తెలిపారు. ప్రతిభ గల వారిని ప్రోత్సహించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. జియాగూడ ఎంసిహెచ్ గ్రౌండ్ లో జరిగిన వీర్ చంద్రశేఖర్ ఆజాద్ బోలు సింగ్ కేసరి నాల్గవ ఓపెన్ తెలంగాణ కుస్తీ పోటీలు సోమ వారం ముగి సాయి. ఈ కార్యక్రమానికి తెలంగాణ స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివసేనారెడ్డి, రాష్ట్ర మత్స్యశాఖ చైర్మన్ మెట్టు సాయికుమార్ లు ముఖ్య అతిథులుగా హాజరై విజేతలకు బహుమతులను అందజేసి మాట్లాడారు. క్రీడలు మానసిక ఉల్లాసానికి, శారీరక దృఢత్వానికి దోహదపడతాయన్నారు. కుస్తీ పోటీలు శారీరకంగా బలంగా ఉన్నవారే చేయగలుగుతారని, దీనికి కఠోరమైన శ్రమ అవసరం ఉంటుందన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ కార్వా నియోజకవర్గ సీనియర్ కాంగ్రెస్ నాయకులు కూరాకుల కృష్ణ, గుడిమల్కాపూర్ వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్ ముంగి రఘు పాల్ రెడ్డి, టిపిసిసి ఎస్సి సెల్ వైస్ చైర్మన్ వినోద్ సింగ్, స్థానిక నాయకులు అబ్దుల్ అహ్మద్, గిరి, రాంకుమార్, కుస్తీ పోటీల నిర్వాహకులు ధరమ్ సింగ్ పైల్వాన్, నర్సింగ్ పైల్వాన్, సాయి పైల్వాన్, కూరాకుల రఘువీర్ పైల్వాన్ లు పాల్గొన్నారు.

### నూతన కమిటీ సభ్యులు మార్కెట్ అభివృద్ధికి పాటుపడాలి : వేం నరేందర్ రెడ్డి



ప్రభుత్వ సలహాదారుడు వేమ్ నరేందర్ రెడ్డికి అభినందనలు తెలుపుతున్న బోయిన్‌పల్లి మార్కెట్ చైర్మన్ ఆనంద్ బాబు,వైస్ చైర్మన్ దేవుడు, కమిటీ సభ్యులు

**కంటోన్మెంట్,ఫిబ్రవరి 10 ప్రభాతవార్త:** మార్కెట్ కమిటీ సభ్యులు రైతులకు, వ్యాపారులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా మార్కెట్ అభివృద్ధికి పాటుపడాలని తెలంగాణ ప్రభుత్వ సలహాదారులు వేమ్ నరేందర్ రెడ్డి సూచించారు. బోయిన్‌పల్లిలోని డాక్టర్ బిఆర్.అంబేద్కర్ కమిటీ నూతన చైర్మన్ ఆర్. ఆనంద్ బాబు గౌడ్, వైస్ చైర్మన్ డి.బి.దేవేందర్ (దేవుడు)లు, మార్కెట్ కమిటీ సభ్యులు సోమవారం వేమ్ నరేందరెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని మార్కెట్ అభివృద్ధికి పాటుపడాలన్నారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కార్యదర్శి వెంకన్న, డైరెక్టర్లు ఎసంతోష్, రామన్, క్రిష్ణారెడ్డి, దుర్గేశ్ గౌడ్, ఆకాశ్ రెడ్డి, అంజద్ పాషా, రాజేందర్, అస్లమ్,గౌతమ్ ,ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

### కంటోన్మెంట్ అభివృద్ధే ధ్యేయం : ఎమ్మెల్యే శ్రీగణేష్

**కంటోన్మెంట్,ఫిబ్రవరి 10 ప్రభాతవార్త:** కంటోన్మెంట్ నియోజకవర్గాన్ని అన్నిరంగాలలో అభివృద్ధిపర్చేందుకే తన ధ్యేయమని ఎమ్మెల్యే శ్రీగణేష్ తెలిపారు. సోమవారం 7వ వార్డులోని తిరుమలగిరి విలేజ్ వనితా సొసైటీ,సెయింట్ ఆంథోని చాపేల్,విరభద్రస్వామి దేవాలయం పరిసర ప్రాంతాల్లో ఆయన పర్యటించి ప్రజా సమస్యలు అడిగి తెలుసుకున్నారు. డ్రైనేజీ, తాగు,బోర్‌వెల్ వాటర్,రోడ్లు అస్థవ్యవస్థ ఉన్నాయని స్థానికులు ఎమ్మెల్యే దృష్టికి తెచ్చారు. ఆయా ప్రాంతాల్లో నెలకొన్న సమస్యలను సిఎం రేవంత్ రెడ్డి దృష్టికి తెచ్చి నియోజకవర్గం అభివృద్ధికి ప్రత్యేక నిధులు విడుదల చేసి సమస్యను పరిష్కరిస్తామన్నారు.కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు మురళీ ముదిరాజ్,నాగినేని సరిత,రేమండ్ హర్‌హుడ్,భవానిసుందర్ రాజన్ పాల్గొన్నారు.

### అనుమతులు లేకుండా భవనాలు నిర్మిస్తే సహించేది లేదు : సిఈఓ

**కంటోన్మెంట్,ఫిబ్రవరి 10ప్రభాతవార్త:** కంటోన్మెంట్ బోర్డు పరిధిలోని వివిధ ప్రాంతాల్లో నివాసం ఉంటున్న ఫ్లాట్ ఓనర్స్ భవనాలు, సొంత ఇండ్లు నిర్మించుకుంటే కంటోన్మెంట్ బోర్డు అనుమతులు తీసుకొని ఇండ్లు నిర్మించుకోవాలని ఫ్లాట్ ఓనర్స్ దళారులను నమ్మ వద్దని బోర్డు సిఈఓ మధుకర్ నాయక్ సూచించారు. సోమవారం సిఖ్ విలేజ్, చందలాల్ బౌలి,ఎల్ఐసీ కాలనీలోని ఫ్లాట్ నెం 36 జిప్లెస్ 1 అనుమతి తీసుకొని నిబంధనలకు విరుద్ధంగా అదనంగా మరో రెండు ఫ్లోర్లను నిర్మించాడు. విషయం తెలుసుకున్న బోర్డు అధికారులు రెండు సంవత్సరాల క్రితమే బోర్డు అధికారులు సీజ్ చేశారు. బిల్డర్ బోర్డు అదికారులు వేసిన సీజ్‌ను తొలగించి కార్యకలాపాలు కొనసాగిస్తున్నాడు. తిరిగి ఆ భవనాన్ని బోర్డు ఇంజనీర్లు సీజ్ చేశారు. త్వరలో ఆ బిల్డింగ్‌పై వెలిసిన అక్రమ నిర్మాణాలను తొలగిస్తామని సిఈఓ మధుకర్ నాయక్ తెలిపారు.

### సర్పంచ్ ఎన్నికల లబ్ధి కోసమే కోటి వరాల కొత్త నాటకం

**-టిడిపి సికింద్రాబాద్ పార్లమెంట్ అధ్యక్షులు సాయిబాబా**



సమావేశంలో మాట్లాడుతున్న సాయిబాబా

**ముషీరాబాద్, ఫిబ్రవరి 10, ప్రభాతవార్త:** రాబోయే సర్పంచ్ ఎన్నికలలో లబ్ధి పొందాలనే ఆశతోనే కాంగ్రెస్ ప్రభుత్వం కోటి వరాలంటూ కొత్త నాటకానికి తెర తీస్తోందని టీడీపీ సికింద్రాబాద్ పార్లమెంట్ అధ్యక్షులు పి.సాయిబాబా విమర్శించారు. సోమవారం లోయర్‌ట్యాంక్‌బండ్‌లోని టీడీపీ కార్యాలయంలో ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ స్థానిక సంస్థల ఎన్నికలు జరగాలని కోరుకునే వారిలో తెలుగుదేశం పార్టీ ముందుంటుందని, కానీ గ్రామ స్వరాజ్యమే దేశ సౌభాగ్యమని విశ్వసించిన గాంధీ మహాత్ముని వారసులుగా చెప్పుకునే కాంగ్రెస్ నాయకులు గత ప్రభుత్వ కాలంలో గ్రామాల అభివృద్ధికై ఖర్చుచేసిన సర్పంచులకు బిల్లులు చెల్లించక, వారిని నానా యాతనకు గురి చేశారని ఆరోపించారు. సర్పంచుల పరిస్థితి పెనం మీద నుండి పొయ్యిలో పడ్డట్లు అయిందని, కాంగ్రెస్‌కు చిత్తశుద్ధి ఉంటే తక్షణమే సర్పంచుల బకాయిలు వెంటనే చెల్లించి, ఆ తర్వాత సర్పంచుల, స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో ప్రధాన కార్యదర్శులు నల్లెల్ల కిషోర్, పి.బాలరాజ్‌గౌడ్, ఎస్.ప్రకాష్, కప్ప కృష్ణా గౌడ్, సుక్రవేది తదితరులు పాల్గొన్నారు.

### తన భార్య కావాలనే వేధిస్తోందని డిఐ ఆరోపణ

**హైదరాబాద్, (అబిడ్స్) ఫిబ్రవరి 10, ప్రభాతవార్త:**

నగర పోలీసు విభాగంలో సంచలనం రేపిన అబిడ్స్ డిఐ నరసింహ వ్యవహారంలో కొత్త ట్విస్ట్ చోటుచేసుకుంది. నరసింహ సతీమణి అదనపు కట్నం కోసం తన భర్త తనను వేధిస్తున్నాడని నేరుగా కమిషనర్ ఆనంద్‌కు ఫిర్యాదు చేయడం తెలిసిందే. దీనిపై డిఐ నరసింహ మీడియాకు వివరణ ఇచ్చారు. తాను తన భార్యతో సహ ఎవరినీ వేధించలేదని, ఆమె కావాలనే తనపై లేనిపోని ఆరోపణలు చేస్తోందని తెలిపారు. గతంలో నల్లగొండ జిల్లా ఎస్పి కార్యాలయంలో ఎస్‌పి సమక్షంలో కుటుంబం పరువు పోకూడదని రాజీకి వచ్చానని. అయినప్పటికీ తన భార్యలో ఎలాంటి మార్పు రాలేదని ఆయన తెలిపారు. కొందరు వ్యక్తులతో కలిసి తన పరువును బజారుకు ఈడుస్తోందని ఆయన ఆరోపించారు. దీనిపై తాను గట్టిగా నిలదీసినందుకు తనపై కమిషనర్‌కు అదనపు కట్నం డిమాండ్ చేసినట్లు ఫిర్యాదు చేసిందని ఆయన తెలిపారు.

## 18న ఆర్‌ఎంపి, పిఎంపిల భారీ బహిరంగ సభ

**సైఫాబాద్, ఫిబ్రవరి 10 ప్రభాతవార్త:** రాష్ట్రంలోని ఆర్‌ఎంపి, పిఎంపిలకు వెంటనే ప్రభుత్వం శిక్షణ ఇవ్వాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 18న 'హాలో ఆర్‌ఎంపి-చలో హైదరాబాద్' పేరిట ఇందిరాపార్కువద్ద భారీ బహిరంగ సభ నిర్వహిస్తున్నామని తెలంగాణ ఆర్‌ఎంపి, పిఎంపి సంఘాల ఉమ్మడి వేదిక తెలిపింది. ఈ మేరకు సోమవారం ఎన్‌ఎస్‌ఎస్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వేదిక రాష్ట్ర అధ్యక్షుడు చోప్పరి శంకర్‌ముదిరాజ్, ప్రతినిధులు రమేష్, బాలబ్రహ్మచారి, మోహన్, రవి శంకర్, భాస్కర్ మాట్లాడుతూ గతంలో వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు రాష్ట్రంలోని 13,500 మంది ఆర్‌ఎంపి, పిఎంపిలకు శిక్షణా ఇప్పించారని చెప్పారు. కాగా తదనంతరం రాష్ట్రంలో జరిగిన పరిణామాలతో ప్రభుత్వం తమను విస్మరించిందని ఆరోపించారు. అయితే తామాంత తెలంగాణ ఉద్యమంలో పాల్గొని సాధన కోసం ఎంతో కృషి చేశామని, బిఆర్ఎస్ ప్రభుత్వం తమకు శిక్షణా ఇస్తామని చెప్పి కాలయాపన చేసిందని ఆరోపించారు. 10 సంవత్సరాల పాటు అధికారంలో కొనసాగిన బిఆర్ఎస్ ప్రభుత్వం పట్టించుకోలేదని, ప్రస్తుతం బిఆర్ఎస్ నేత టి.హరీష్‌రావు ఆర్‌ఎంపి, పిఎంపిల మధ్య చిచ్చుపెట్టడానికి తీవ్రంగా ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. గడిచిన అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ పార్టీ





సమావేశంలో మాట్లాడుతున్న చోప్పరి శంకర్

తమ డిమాండ్‌ను ఎన్నికల మ్యానిఫెస్టోలో చేర్చిందన్నారు. ఇటీవల రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజ నర్సింహ, ఇతర మంత్రులను కలిసి వినతి పత్రాలను సమర్పించామని, వారంతా సానుకూలంగా స్పందించారని చెప్పారు. 18వ తేదీన జరిగే భారీ బహిరంగ సభకు రాష్ట్రంలోని 40 వేల మంది ఆర్‌ఎంపిలు, పిఎంపిలు పాల్గొని విజయవంతం చేయాలని వారు విజ్ఞప్తి చేశారు. ఈ బహిరంగ సభలో పాల్గొనాలని దామోదర రాజ నర్సింహ, పిసిసి అధ్యక్షుడు బి.మహేష్‌కుమార్‌గౌడ్, ఎంఎల్‌సి ఎం.కోదండరామ్ తదితరులను ఆహ్వానించామని వారు చెప్పారు.

## అరవింద్ కేజ్రీవాల్ పై చేసిన ఆరోపణలు నిరూపించండి

**-మేం రాజకీయాల నుండి తప్పుకుంటాం? లేదా మీ ప్రభుత్వం రాజీనామా చేయాలి : డాక్టర్ దిడ్డి సుధాకర్**

**చిక్కడపల్లి, ఫిబ్రవరి 10 ప్రభాతవార్త:** ఢిల్లీ ఎన్నికల్లో సామ దాన భేద దండోపాయాలని ఉపయోగించి ఆమ్ ఆద్మీ పార్టీ ని అష్ట దిగ్బంధనం చేసినా రెండు కన్నా తక్కువ శాతం ఓట్లతో ఒడి పోవడం జరిగిందని, నైతిక విజయం మా పార్టీ దేనని ఆ పార్టీ తెలంగాణ రాష్ట్ర కన్వీనర్ డాక్టర్ డి.సుధాకర్ అన్నారు. సోమవారం బాగ్‌లింగంపల్లి సుందరయ్య విజ్ఞానకేంద్రంలో మెదక్, జహీరాబాద్ నియోజకవర్గం నుంచి దాదాపు 15 మంది సభ్యులు ఆమ్ ఆద్మీ పార్టీలో చేరారు. వారందరికి పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించిన అనంతరం సుధాకర్ మాట్లాడుతూ ఢిల్లీ మాజీ సిఎం రవింద్ కేజ్రీవాల్ పై చేసిన ఆరోపణలు 6 నెలల్లో ప్రూవ్ చేయండి, మేం రాజకీయాల నుండి తప్పుకుంటాం లేదా మీ ప్రభుత్వం రాజీనామా చేయాలని సవాల్ విసిరారు. పార్టీలో చేరిన ఒక్కొక్కరు వేల మందితో సమానం అని, ముమ్ముందు భారతదేశం అంతట పార్టీ విస్తరించి 2029 ఎన్నికల్లో కేజ్రీవాల్ ను ప్రధాని చేసే దిశగా పనిచేస్తామన్నారు. బిజెపి కుల, మత రాజకీయలు చేయడం మానుకోవాలన్నారు. పార్టీ నేత సాల్మన్‌రాజ్ మాట్లాడుతూ రాజకీయంలో గెలుపు ఓటములు సహజమని కార్యకర్తలు ఎవరు నిరాశ చెందొద్దని సూచించారు.



ఎవ్రీ ఫెయిల్యూర్ ఇజ్ స్టెప్పింగ్ స్టోన్ టు సక్సెస్ అని ఆయన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన బిజెపికి చురకలు అంటించారు. ఫెయిర్ అండ్ ట్రాన్స్పరెంట్ పాలిటిక్స్ చేసి గెలవగలరా? అని సూటిగా ప్రశ్నించారు. పార్టీ జహీరాబాద్ నియోజకవర్గ ఇంచార్జ్ పంతాటి రాజు మాట్లాడుతూ పార్టీ బలోపేతానికి కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ కోర్ కమిటీ సభ్యుడు రాముగౌడ్, డాక్టర్ అన్సారీ, డాక్టర్ లక్ష్మ్యానాయుడు, జావీద్ షరీఫ్, రాజేశ్వర్, ఉమారాణి, సుందర్ జేమ్స్, నిజాముద్దీన్, సుల్తాన్, దర్శనం రమేశ్, కొడంగల్ శ్రీనివాసులు పాల్గొన్నారు.

### విద్యార్థులకు అవగాహన కల్పించాలి



విద్య ఎక్స్‌ఫో పాల్గొన్న చిన్నారులు

**అఫ్జల్‌గంజ్,ఫిబ్రవరి 10ప్రభాతవార్త:** పాఠశాల స్థాయి నుంచే విద్యార్థి,విద్యార్థులకు సమాజంలోని విద్య,వైద్య, ఉద్యోగ,రాజకీయ,న్యాయ వ్యవస్థ,పోలీసు విభాగాలపై ఉపాధ్యాయులు అవగాహన కల్పించాల్సిన అవసరం ఎంతైనా ఉందని శ్రీకృష్ణవేణి టాలెంట్ విద్యాసంస్థల అధ్యక్షులు జైపాల్‌రెడ్డి అన్నారు. రహీంపురా శ్రీకృష్ణవేణి టాలెంట్‌స్కూల్ ఆవరణలో ఏర్పాటు చేసిన విద్యాఎక్స్‌ఫో కార్యక్రమంలో పాఠశాల బాల,బాలికలు,ఉపాధ్యాయులు తయారు చేసిన వివిధ నమోనాలను జర్నల్ ఇన్‌చార్జ్ జహంగీర్,ప్రిన్సిపల్ జి.బెన్నిలతో కలిసి పరిశీలించారు. ముఖ్యంగా చిన్నారులు సమాజంలో ప్రజలు చేస్తున్న వృత్తులను రూపొందించిన పోలీస్‌స్టేషన్, క్లీనిక్, పోస్ట్ ఆఫీస్‌తదితర నమోనాలు ఎంతో ఆకట్టుకున్నాయి. వాటిని తయారు చేసిన ఉపాధ్యాయులు,చిన్నారులను యాజమాన్యం అభినందించారు. అయోధ్య, చిత్రపటం ,రాముడు,అంజనేయ వేషధారణ మంత్రముగ్ధులను చేసింది.

### ప్రజలు ఆరోగ్యం పట్ల శ్రద్ధ తీసుకోవాలి



వైద్యపరీక్షలు చేయించుకుంటున్న ఎమ్మెల్యే టి.రాజాసింగ్

**జియాగూడ,ఫిబ్రవరి 10ప్రభాతవార్త:** ప్రజలు,తమ ఆరోగ్యాన్ని కాపాడుకోవడం పట్ల ప్రత్యేక శ్రద్ధ కనబర్చాలని గోషామహల్ నియోజకవర్గం బిజెపి శాసనసభ్యులు టి.రాజాసింగ్ అన్నారు.ఈమేరకు జాంబాగ్‌లోని యాదవ సంఘం భవన్‌లోఅగర్వాల్ మానవ సేవ మంచ్, జాంబాగ్ యాదవ్ సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత వైద్యశిబిరాన్ని గొల్కొండ జిల్లా అధ్యక్షులు వి. పాండుయాదవ్, విఠోబా దేవాలయం అధ్యక్షులువి. కిషన్‌యాదవ్,యాదవసంఘం అధ్యక్షులు బోయిని వెంకటేష్‌యాదవ్,కోశాధికారి ఎషం మనిష్‌యాదవ్‌లతో కలిసి రాజాసింగ్ ప్రారంభించారు.ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వచ్ఛంద సంస్థలు ముందుకు వచ్చి పేదల కుమరిన్ని సేవలను అందించాలన్నారు.ముఖ్యంగా అగర్వాల్‌సమాజ్,యాదవ్ సమాజ్‌లు వైద్యశిబిరం ఏర్పాటు చేసిఉచితంగా వైద్యసేవలను అందించడం సంతోషదాయకమన్నారు.వైద్యపరీక్షలు అందించి ఉచితంగా మందులను అందచేశారు.

## జూబ్లీహిల్స్‌లో దారుణం

**పంజగుట్ట, ఫిబ్రవరి 10 (ప్రభాతవార్త):**

జూబ్లీహిల్స్ లో దారుణం చోటు చేసుకుంది. దిండుతో నోరు నొక్కేసి..అర్ధరాత్రి గదిలోకి వచ్చి...యువతిపై అత్యాచారం చేసిన సంఘటన సంచలనం రేపింది.పెళ్లి విషయంలో సాయం చేస్తా అంటూ కాటేసిన కామాంధుడు.బంగ్లాలో వాచ్ మెన్ కుమార్తె(19) మీద డ్రైవర్ శివ నరసింహ ఘాతుకం.బాధిత యువతి ఫిర్యాదుతో అత్యాచారం కేసు నమోదు చేసిన జూబ్లీహిల్స్ పోలీసులు. కాగాఈ సంఘటనను పోలీసులు సీరియస్‌గా తీసుకున్నారు. నిందితుడిపై పలు సెక్షన్ల కింద కేసులు నమోదు చేశారు.

## రంగరాజన్‌పై దాడి చేసిన వారిని కఠినంగా శిక్షించాలి

**-తెలంగాణ అడ్వకేట్ జెఎసి కన్వీనర్ పులిగారి గోవర్ధన్‌రెడ్డి**



సమావేశంలో మాట్లాడుతున్న పులిగారి గోవర్ధన్‌రెడ్డి

**ముషీరాబాద్, ఫిబ్రవరి 10, ప్రభాతవార్త:** తెలంగాణ తిరుపతిగా పేరు గాంచిన చిలుకూరి బాలాజీ దేవాలయ ప్రధాన అర్చకులైన రంగరాజన్‌పై దాడి చేసిన వారిని కఠినంగా శిక్షించాలని తెలంగాణ అడ్వకేట్ జేఏసీ కన్వీనర్ పులిగారి గోవర్ధన్‌రెడ్డి డిమాండ్ చేశారు. సోమవారం ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ రామరాజ్య స్థాపన సంస్థ పేరుతో 20 మంది నల్ల దుస్తులతో వచ్చి అర్చకుడిపై దౌర్జన్యం చేయటాన్ని తెలంగాణ న్యాయవాదులుగా తీవ్రంగా ఖండిస్తున్నామని తెలిపారు. చట్టాలను, న్యాయాలను అనుసరించి, రామరాజ్య స్థాపన కోసం తాను కృషి చేస్తున్నానని అర్చకులు చెప్పినప్పటికీ న్యాయ వ్యవస్థలో అందరూ దొంగలే, వారి తోలు తీయటానికే తాము వచ్చామని చెబుతూ న్యాయవ్యవస్థను తూలనాడటం చూస్తూ ఉంటే ఓ కొత్త మత తీవ్రవాద స్థాపనకు వచ్చినట్లు అర్థమవుతోందని, హిందూ సనాతన ధర్మంలో ఇలాంటి చర్యలకు తావు లేదని స్పష్టం చేశారు. రాష్ట్ర హైకోర్టు స్పందించి, సొమోటగా విచారించి, పురిటిలోనే ఈ దాడులను అరికట్టాలని, దాడికి పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదులు పెండ్యాల రాంచంద్రరావు, సముద్రాల శ్రీనివాస్, వేణుగోపాల్‌రెడ్డి, వై.కిషన్ పాల్గొన్నారు.

### మర్రిని కలిసిన మహంకాళీ జిల్లా బిజెపి అధ్యక్షుడు భరత్‌గౌడ్



**బేగంపేట ఫిభ్రవరి 10,ప్రభాతవార్త**

సికింద్రాబాద్ జిల్లా బీజేపీ నూతన అధ్యక్షుడిగా ఎన్నికైన జి.భరత్‌గౌడ్ సోమవారం బేగంపేట మోతీలాల్ నెహ్రూ నగర్‌లో సనత్‌నగర్ మాజీ ఎమ్మెల్యే ,బీజేపీ నాయకులు మర్రి శశిధర్‌రెడ్డిని మర్యాద పూర్వకంగా కలిసారు.ఈ సందర్భంగా మర్రి భరత్‌గౌడ్‌ను శాలువాతో సత్కరించారు.భరత్‌గౌడ్ కూడా మర్రిని శాలువాతో సత్కరించారు.ఈ సందర్భంగా నియోజకవర్గంలోని ముఖ్య నాయకులను మర్రి భరత్‌గౌడ్‌కు పరిచయం చేసారు. ఈ సందర్భంగా మర్రి శశిధర్‌రెడ్డి మాట్లాడుతూ జిల్లాలోని బీజేపీ నాయకులను సమన్వయం చేసుకుంటూ ముందుకు తీసికెళ్తూ ఎప్పటి కప్పుడు ప్రజా వ్యతిరేక నిర్ణయాలపై ప్రభుత్వంపై పోరాటం చేస్తూ పార్టీనీ పటిష్టం చేయాలని,రానున్న జీహెచ్‌ఎంసీ ఎన్నికలకు కార్యకర్తలను సమాయత్తం చేయాలని సూచించారు.ఈ కార్యక్రమంలో బీజేపీ యువ నాయకులు మర్రి పురురవారెడ్డి,మాజీ కార్పొరేటర్ వసంత నర్సింగ్ రావు నెమలి ఆనంద్ (నందూ),సురేష్ రావెల్,నక్క శ్రీనివాస్,సందీప్‌వర్మ,ఆకుల ప్రతాప్,కృష్ణ చైతన్య,నరేందర్, ఆనంద్,మల్లేష్,సంతోష్,దయానందరావు,నర్సింగరావు,రమేష్,వికాస్,కిరీట,తదితరులు పాల్గొన్నారు.

## నూతన పద్ధతులు, సమర్ధవంతమైన విధానాలతో పనితీరు మెరుగుపరచాలి



కార్యక్రమంలో మాట్లాడుతున్న ప్రిన్సిపల్

**హాయత్‌నగర్, ఫిబ్రవరి 10 ప్రభాతవార్త:** నూతన సాంకేతిక పద్ధతులు, సమర్ధమంతమైన విధానాలను వినియోగించడం ద్వారా ప్రభుత్వ కార్యాలయాల పనితీరులో వేగాన్ని కచ్చితత్వాన్ని పెంపొందించవచ్చని హయత్‌నగర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డా.సరేష్‌బాబు, సూపరిండెంట్ లావణ్య అన్నారు. పాలనా శాస్త్ర విభాగం ఆధ్వర్యంలో కళాశాలలో సోమవారం ప్రభుత్వ కార్యాలయాల నిర్వహణపై ప్రత్యేక వర్క్‌షాప్ నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ... ప్రభుత్వ కార్యాలయాల నిర్వహణలో నిబంధనల పరిధి, జీతభత్యాల నిర్వహణ, కార్యాలయ దస్త్రాల నిర్వహణ, మారుతున్న పరిస్థితులను అనుసరించి ఈ–ఆఫీస్ నిర్వహణ వంటి అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ శ్రీనివాస్‌రెడ్డి, అధ్యాపకులు డా.గీతనాయక్, డా.గంగాధర్, డా.వెంకటేశ్వర్లు, డా.యాదగిరిరెడ్డి, డా.నాగేంద్ర, డా.రమాదేవి, మహమ్మద్, డా.దుర్గాప్రసాద్ పాల్గొన్నారు.

## టెండర్లు పూర్తయిన పనులకు నిధులు కేటాయించాలి



జోనల్ కమిషనర్‌కు వినతిపత్రం అందిస్తున్న కార్పొరేటర్

**హాయత్‌నగర్, ఫిబ్రవరి 10 ప్రభాతవార్త:** టెండరు ప్రక్రియ పూర్తయి పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి పనులకు వెంటనే నిధులను కేటాయించాలని కోరుతూ మన్సూరాబాద్ కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డి సోమవారం ఎల్.బి.నగర్ జోనల్ కమిషనర్‌కు వినతి పత్రం అందించారు. దీనిపై స్పందించిన జోనల్ కమిషనర్ సీసీరోడ్లు ఇతర అభివృద్ధి పనులకు 2 కోట్ల రూపాయలను కేటాయిస్తున్నట్లు తెలపగా కార్పొరేటర్ ఆయనకు కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం నర్సింహారెడ్డి మాట్లాడుతూ... జీహెచ్‌ఎంసీ బడ్జెట్ కౌన్సిల్ సమావేశంలో ప్రజలు కడుతున్న పన్నులకు అనుగుణంగా ఎల్బీనగర్ నియోజకవర్గానికి 25 కోట్లు కేటాయిస్తున్నారని ఈక్రమంలో డివిజన్‌కు 2 కోట్లు నిధులను మంజూరు చేసినట్లు వివరించారు. మన్సూరాబాద్ డివిజన్‌లో ఆదిత్యనగర్, సీఎస్‌ఆర్ కాలనీ, టీనగర్, వినాయక్‌నగర్ కాలనీ, శివంహిల్స్ కాలనీ, నందిహిల్స్, శివగంగాకాలనీ, పవనగిరి కాలనీ 1,2లలో సీసీ రోడ్ల ఏర్పాటుకోసం నిధులు మంజూరయినట్లు తెలిపారు. శివరాత్రి పండుగను పురస్కరించుకుని వీరన్నగుట్ట శివాలయం వద్ద రోడ్డు ఫార్మేషన్, విద్యుత్ దీపాల ఏర్పాటు, శానిటేషన్ సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని జోనల్ కమిషనర్ హామీనిచ్చినట్లు కార్పొరేటర్ వివరించారు.

## బచ్ పన్ అకాడమిక్ హైట్స్ పాఠశాల వార్షికోత్సవ వేడుకలు



**తుర్కయంజాల్ ఫిబ్రవరి 10 (ప్రభాతవార్త)**

తుర్కయంజాల్ మున్సిపాలిటీ ఇంజాపూర్ వెంకటేశ్వర నగర్ కాలనీలోని బచ్ పన్ అకాడమిక్ హైట్స్ పాఠశాలలో ఘనంగా వార్షికోత్సవ వేడుకలు జరిగాయి. ఈ కార్యక్రమానికి విచ్చేసిన పాఠశాల డైరెక్టర్లు శ్రీ నోముల కృష్ణగౌడ్,శ్రీ కోయిలకుంట్ల శ్రీకాంత్ రెడ్డి,శ్రీమతి రూపా రెడ్డి, శ్రీ కౌశిక్ రెడ్డి జ్యోతి ప్రజ్వలనం చేసి ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. విద్యార్థులు చిన్నతనము నుండే పెద్ద ఆశయాన్ని ఏర్పాటు చేసుకొని రాణించాలని వారు సూచించారు .అంతేగాక ప్రస్తుత సమాజంలో చదువుతోపాటు ఆటపాటలు ,సాంస్కృతిక కార్యక్రమాలు దైనందిన జీవితంలో ఒక భాగంగా మారాయని ,ప్రతి విద్యార్థి వాటిని నేర్చుకోవాలని ఇలాంటి విషయాలలో తల్లిదండ్రుల ప్రోత్సాహం ఎంతో అవసరమని వారు ప్రసంగంలో తెలిపారు. అనంతరం విద్యార్థులు గో గో గోవిందా ,ప్రకృతి వందన అంటూ పర్యావరణ పరిరక్షణ ,శక్తి హై భక్తి హై అంటూ ఇతిహాస ఘట్టాలను , దశావతారం, గణేష్ వందనం అంటూ ఆధ్యాత్మికతను , వందేమాతరం అంటూ దేశభక్తిని తెలియజేసే ఇలా పలురకాల నృత్య ప్రదర్శనలు చేసారు.వార్షికోత్సవం చాలా సందడిగా సాగింది .ఇంకా ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు శ్రీమతి అరుణ, ఉపాధ్యాయులు , పాఠశాల సిబ్బంది ,తదితరులు పాల్గొన్నారు.

## జలమండలిలో ఎఎంఎస్ టెండర్ విధానాన్ని రద్దు చేయాలి : పోల్కం శ్రీనివాస్



మంత్రి ఉత్తమ కుమార్ రెడ్డికి సమర్పిస్తున్న పోల్కం శ్రీనివాస్

**మలక్ పేట ,ఫిబ్రవరి 10, ప్రభాతవార్త:**

జలమండలిలో ఏఎంఎస్ (యాన్యువల్ మెయింటెనెన్స్ సిస్టం) టెండర్ విధానాన్ని రద్దు చేయాలని రాష్ట్ర కాంగ్రెస్ ఓబీసీ సెల్ ప్రధాన కార్యదర్శి, జలమండలి కాంట్రాక్టర్స్ జేఏసీ మీడియా ఇంచార్జ్ పోల్కం శ్రీనివాస్ పేర్కొన్నారు. ఏఎంఎస్ టెండర్ విధానాన్ని రద్దు చేయాలని కోరుతూ పోల్కం శ్రీనివాస్ నాయకులు, కార్యకర్తలతో కలిసి సంబంధిత శాఖ మంత్రి ఉత్తంకుమార్ రెడ్డికి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలోని తెలుగుదేశం, కాంగ్రెస్ ప్రభుత్వంలో లేని విధానాన్ని బిఆర్ఎస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఎం ఎస్ టెండర్ విధానాన్ని రద్దు చేయాలని పేర్కొన్నారు. సుమారు 800 మంది కాంట్రాక్టర్లకు పని లేకుండా చేస్తున్న గతంలో బిఆర్ఎస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన పాలసీని తక్షణమే నిలిపివేయాలని, పాత విధానాన్ని కొనసాగించేలా చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. చిన్న కాంట్రాక్టర్లకు మేలు జరిగే విధంగా పాత విధానాన్ని కొనసాగించాలని కోరారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తో మాట్లాడి న్యాయం జరిగే విధంగా కృషి చేస్తామని మంత్రి హామీ ఇవ్వడం జరిగిందని పోల్కం శ్రీనివాస్ వివరించారు.

# కూల్చివేతలంటే స్లాబుకు రంధ్రాలు పెట్టడమేనా..?

-ఏడాది కాలంగా ప్రధాన రహదారి పక్కన నిర్మాణంనజరుగుతుంటే ఎల్‌బినగర్ సర్కిల్ అధికారులకు కానరాలేదా ?

-విమర్శలకు దారి తీస్తున్న ఎల్‌బినగర్ సర్కిల్ టౌన్‌ప్లానింగ్ సిబ్బంది పనితీరు..



స్లాబుకు రంధ్రాలు పెడుతున్న సిబ్బంది (ఫైల్ ఫోటో)

**సైదాబాద్, ఫిబ్రవరి 10 ప్రభాతవార్త:**

అక్రమ నిర్మాణాల కూల్చివేత అంటే ఎల్‌బినగర్ సర్కిల్ అధికారులు కొత్త అర్థం చెబుతున్నారు. ఎలాంటి అనుమతులు లేకుండా నిర్మాణం చేపట్టారని చెబుతూనే కేవలం స్లాబులకు రంధ్రాలు వేసి తాము అక్రమ నిర్మాణాలు కూల్చివేశామని గొప్పగా చెబుతుండడం తీవ్ర విమర్శలకు దారి తీస్తుంది. తాము అనుకుంటే నోటీసులు ఇస్తాం..మొత్తం కూల్చివేస్తాం..లేకుంటే మొత్తం నిర్మాణం పూర్తయ్యే వరకు నోటీసులతోనే కాలం వెళ్లదీస్తాం..కూల్చి వేతలు చేపట్టినా మమ అనిపిస్తాం..అనేలా టౌన్‌ప్లానింగ్ అధికారులు వ్యవహరిస్తున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. గ్రీన్‌పార్క్ కాలనీ ఆర్చ్ సమీపంలో మెగా ఫంక్షన్ హాల్ ఎదురుగా 1215 గజాల స్థలంలో ఎలాంటి అనుమతులు లేకుండా నిర్మాణాలు చేపట్టారంటూ ఈ నెల 6వ తేదీన టౌన్ ప్లానింగ్ సిబ్బంది సెల్లార్ కోసం వేసిన స్లాబుకు అక్కడక్కడ రంధ్రాలు వేసి దీన్ని కూల్చివేతలుగా చెబుతున్నారు. దాదాపు సంవత్సర కాలంగా కర్మన్‌ఘాట్ మెయిన్ రోడ్డుకు అనుకుని 1215 గజాల స్థలంలో భారీ ఎత్తున సెల్లార్ తవ్వి, సెల్లార్ స్లాబును పూర్తి చేసి, దానిపై గ్రౌండ్ ఫ్లోర్ కోసం పిల్లర్ల నిర్మాణం పూర్తి చేసినప్పటికీ ఎల్‌బినగర్ టౌన్ ప్లానింగ్ అధికారులకు దృష్టికి రాకపోవడం విచిత్రమనే చెప్పాలి. నిర్మాణం మొదలు పెట్టిన దాదాపు సంవత్సరం తర్వాత వచ్చి అక్రమ నిర్మాణమని పేర్కొంటుండడం పట్ల స్థానికులు ముక్కున వేలేసుకుంటున్నారు. ఇప్పుడు కూడా ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారుల ఆదేశాల మేరకే కూల్చివేశామని స్థానిక టౌన్ ప్లానింగ్ సిబ్బంది చెబుతుండడం గమనార్హం. ఎల్‌బినగర్ టౌన్‌ప్లానింగ్ అధికారుల పనితీరుకు ఇది నిదర్శనంగా నిలుస్తుందని స్థానికులు పేర్కొంటున్నారు. ఎన్‌ఫోర్స్‌మెంటు అధికారుల ఆదేశిస్తే తప్ప అక్రమ నిర్మాణాలు ఎల్‌బినగర్ అధికారులకు కానరావడం లేదా అని స్థానికులు ప్రశ్నిస్తున్నారు.

**క్షేత్రస్థాయి పర్యవేక్షణ ఉందా..లేదా..?**

టౌన్‌ప్లానింగ్ విభాగంలో క్షేత్రస్థాయిలో చైన్‌మెన్లు, టిపిఎస్‌లు ఉంటారు. వీరి మీద ఎసిపి స్థాయి అధికారి ఆపై ఇతర ఉన్నతాధికారులు ఉంటారు. క్షేత్ర స్థాయి సిబ్బంది ఎప్పటికప్పుడు తమ పరిధిలో జరిగే అక్రమ నిర్మాణాలను గుర్తించి తమ పై స్థాయి అధికారులకు తెలియజేసి వారి ఆదేశాల మేరకు నోటీసులు ఇచ్చి కూల్చివేతలు చేట్టాల్సి ఉంటుంది. అయితే లింగోజిగూడ డివిజన్‌లో మాత్రం క్షేత్ర స్థాయి టౌన్ ప్లానింగ్ సిబ్బంది పర్యవేక్షణ ఉందా లేక చూసి చూడనట్లుగా వ్యవహరిస్తూ అక్రమ నిర్మాణాలను ఉన్నతాధికారులతో కలసి వారే ప్రోత్సహిస్తున్నారా అన్న అనుమానాలు స్థానికులు వ్యక్తం చేస్తున్నారు.

# శ్రీ కోదండ రామలింగేశ్వరస్వామి ఆలయం కమిటి ఎన్నిక

**ఉప్పల్, ఫిబ్రవరి 10 ప్రభాతవార్త :** రామంతాపూర్ శ్రీనివాసపురంలోని శ్రీ కోదండ రామలింగేశ్వరస్వామి ఆలయం కమిటి ప్రమాణ స్వీకారోత్సవం సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమానికి ఉప్పల్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జీ మందముల పరమేశ్వర్‌రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. నూతన ఆలయ కమిటి నేతలతో దేవాదాయశాఖ అధికారి ప్రణీత్ ప్రమాణ స్వీకారం చేయించారు. ఆలయ ట్రస్టీ చైర్మన్‌గా కంది ఆగిరెడ్డి, సభ్యులుగా నాగారం శ్రీనివాసాచారి, సంపత్, వేం యాకుబ్‌రెడ్డి, చేవెళ్ల మల్లయ్య కురుమ, నాగరాజు, శ్రీవాణి ప్రమాణ స్వీకారం చేశారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో కాంగ్రెస్ ఇంచార్జీ ఎం.పరమేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ ఆలయ అభివృద్ధికి నూతన కమిటి నేతలు కృషి చేయాలని కోరారు. ఆలయంలో భక్తులకు వివిధ సౌకర్యాలు కల్పించేందుకు చర్యలు తీసుకుంటామని కమిటి నేతలు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ కార్యనిర్వహణ అధికారి అంజయ్య, కాంగ్రెస్ నేతలు కంది శ్రవణ్‌రెడ్డి, అకారపు అరుణ్ పటేల్, విజయ్‌కుమార్, పేట మురళీ, మార్తం ఉపేందర్ రెడ్డి, వల్లపు శ్రీకాంత్‌యాదవ్, బాబు, శాగ శ్రీధర్, సతీష్ గౌడ్, ధర్మేంద్రనాయక్, రాఘవేందర్,వాసునాయక్, బిల్లకంటి యాదయ్య, మల్లేష్, రఘు, ప్రకేష్,కిషోర్, భాను, నాగచారి, భాస్కర్, పాషా, సంజీవ్, చైతన్య, పలువురు పార్టీ నేతలు, భక్తులు పాల్గొన్నారు.



నూతనంగా ప్రమాణ స్వీకారం చేసిన శ్రీ కోదండ రామాలయం కమిటి నేతలతో కాంగ్రెస్ ఇంచార్జీ ఎం.పరమేశ్వర్‌రెడ్డి తదితరులు

## ఓపెన్ స్థలాల అన్యాక్రాంతంపై ఎమ్మెల్యే విచారణ జరిపించాలి : చెరుకుపల్లి వెంకట్‌రెడ్డి

**సరూర్‌నగర్, ఫిబ్రవరి 10 ప్రభాతవార్త:** మహేశ్వరం నియోజకవర్గంలోని బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్‌లో సుమారు 35 నుండి 40 కోట్ల రూపాయల విలువ చేసే దాదాపు 11,500 చదరపు గజాల ఓపెన్ స్థలాల అన్యాక్రాంతంపై విచారణ జరిపించి వాటిని కాపాడే ప్రయత్నాలు చేయాలని మాజీ మంత్రి, స్థానిక ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డిని బిజెపి సీనియర్ నాయకుడు, స్థానిక కార్పొరేషన్ పార్టీ మాజీ అధ్యక్షుడు చెరుకుపల్లి డిమాండ్ చేశారు. సోమవారం నాదర్‌గుల్‌లోని నియోజకవర్గ కేంద్ర పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన లేఔట్లలో ప్రజోపయోగార్థం వదిలిన ఓపెన్ స్థలాలు/పార్కు స్థలాల కబ్జాలు, కార్పొరేషన్‌లో అసంపూర్తి ఎస్ఎన్‌డిపి పనులు, వివిధ జోన్ల కింద ఉన్న ప్రాంతాల ఇళ్ళ నిర్మాణాల్లో జరుగుతున్న అవినీతి, బడంగ్‌పేట్–నాదర్‌గుల్ రహదారి 100 ఫీట్లా? లేక 150 ఫీట్లా అనే దానిపై అస్పష్టత తదితర అంశాలను ప్రస్తావించారు. వీటన్నింటిపై ఇటీవల స్థానిక మంత్రిని కలిసి ఒక వినతి పత్రం ఇచ్చామని ఆయన వెల్లడించారు. కార్పొరేషన్‌లోని 31వ డివిజన్‌లోని మున్సిపల్ కాలనీ లేఔట్‌లో 5100 గజాలు, బాలాజీనగర్ లేఔట్‌లో 400 గజాలు, 30వ డివిజన్ ఎంసిఆర్ కాలనీలో 2 వేల గజాలు, 23వ డివిజన్ మారుతీనగర్‌లో 2200 గజాలు, 19వ డివిజన్ గాయత్రీహిల్స్‌లో 400 గజాలు, 18వ డివిజన్ అయోధ్య కాలనీలో 1600 గజాలు మొత్తం కలిసి 11,500 గజాలు ఆక్రమణలకు గురయ్యాయనీ వీటిలో యధేచ్ఛగా ఇంటి నిర్మాణాలు జరుపుతున్నారనీ ఈ విషయమై గతంలో కార్పొరేషన్ కమీషనర్, మేయర్, టిపిఎస్‌లతో పాటు జిల్లా కలెక్టర్, సిడిఎంఎ, జిల్లా రిజిస్ట్రార్, హైడ్రాలకు ఫిర్యాదు చేసినా ఎలాంటి ఫలితం లేకుండా పోయిందనీ ఈ నేపథ్యంలో ఎమ్మెల్యేగా సదరు స్థలాల కబ్జాలపై విచారణ చేయించాలని ఆయన డిమాండ్ చేశారు. ఇక పోతే కార్పొరేషన్‌లో బడంగ్‌పేట్ పెద్దబావి మల్లారెడ్డి ఫంక్షన్ హాల్ వరకు వచ్చి అర్థాంతరంగా నిలిచిపోయిన ప్రతిష్టాత్మక ఎస్ఎన్‌డిపి నాలా పనులు ఎప్పటికి పూర్తి చేస్తారని ఆయన ప్రశ్నించారు. అదే విధంగా కార్పొరేషన్‌లోని కొన్ని డివిజన్లలో గ్రీన్ జోన్, సెంటర్ స్పేస్ జోన్, బఫర్ జోన్ తదితర జోన్ల కింద ఉన్న ప్రాంతాల్లో ఇంటి నిర్మాణాలకు అనుమతి లేకపోవడంతో కార్పొరేషన్ టౌన్ ప్లానింగ్ అధికారులకు, స్థానిక ప్రజాప్రతినిధులకు లక్షలాది డబ్బులు సమర్పించుకొని చాలా మంది పాత జిపి పర్మిషన్లతో ఇళ్లు కట్టుకున్నారనీ అయితే గత ఎన్నికలకు ముందు ఉన్న ప్రభుత్వంలో జోన్లు ఎత్తేశారని ప్రచారం చేసిన నేతలు పాలాభిషేకాలు కూడా జరిపారనీ గుర్తు చేస్తూ దానికి సంబంధించి ఇప్పటి వరకు ఎలాంటి గెజిట్ నోటిఫికేషన్ లేదని వెంకట్‌రెడ్డి అన్నారు. ఇక ప్రధాన రోడ్డు విస్తరణ అభివృద్ధి విషయానికి వస్తే అసలు బడంగ్‌పేట్ నుండి నాదర్‌గుల్ వరకు 100 ఫీట్లా లేక 150 ఫీట్లా అనేది అయోమయంగా ఉందని దీనిపై స్పష్టత ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు. ఇప్పటికే ప్రధాన రోడ్ల పక్కన నిబంధలకు విరుద్దంగా జరిగిన నిర్మాణాలపై అధికారులు, ప్రజాప్రతినిధులు కుమ్మక్కై కోట్లల్లో ప్రభుత్వ ఆదాయానికి గండికొట్టారని ఆయన వెల్లడించారు. గడచిన ఐదు సంవత్సరాల్లో కార్పొరేషన్ కౌన్సిల్ సమావేశాలకు సంబంధించిన ఎజెండాలపై నిధులు, తీర్మాణాలు, టెండర్లు, చేసిన పనుల్లో జరిగిన వ్యవహారాలపై విజిలెన్స్ అధికారులచే విచారణ జరిపించాలని వెంకట్‌రెడ్డి డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో బడంగ్‌పేట్ కార్పొరేషన్ 1, 2 బిజెపి అధ్యక్షులు రాళ్ళగూడెం రామకృష్ణారెడ్డి, రామిడి వీరకర్ణారెడ్డి, నాదర్‌గుల్ మాజీ ఎంపిటిసి తర్రె మల్లేష్ యాదవ్ పాల్గొన్నారు.



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న చెరుకుపల్లి వెంకట్‌రెడ్డి

## కాలనీలను అభివృద్ధి చేశామనే తృప్తి ఉంది : మాజీ మేయర్ పారిజాత



పారిజాత నర్సింహారెడ్డి దంపతులను సన్మానిస్తున్న కాలనీవాసులు

**సరూర్‌నగర్, ఫిబ్రవరి 10 ప్రభాతవార్త:**

మేయర్‌గా, కార్పొరేటర్‌గా కాలనీలను అభివృద్ధి చేశామనే సంతృప్తి ఉందని చిగిరింత పారిజాత నర్సింహారెడ్డి అన్నారు. కార్పొరేషన్‌లోని స్వంత డివిజన్ 31లోని శ్రీ సాయి బాలాజీ హోమ్స్ ఫేస్–2 కాలనీలో మాజీ మేయర్ దంపతులకు కాలనీవాసుల ఆత్మీయ సన్మానం చేశారు. ఈ సందర్భంగా కాలనీలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పారిజాతతో పాటు మాజీ వైస్ ఛైర్మన్ చిగిరింత నర్సింహారెడ్డిని ఘనంగా సత్కరించి కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం పారిజాత మాట్లాడుతూ అప్పట్లో జరిగిన కార్పొరేషన్ ఎన్నికల్లో అందరి సహకారంతో కార్పొరేటర్‌గా గెలిచి ఆ తర్వాత మేయర్ అయ్యాయని గుర్తు చేస్తూ సంతోషం వ్యక్తం చేశారు. అయితే కాలనీల్లో రోడ్లు, డ్రైనేజీలను నిర్మించి ప్రజలకు మౌళిక సదుపాయాలను కల్పించామని అన్నారు. ప్రజా సమస్యలు పరిష్కరించడం ఆనందంగా ఉందని ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో కాలనీ అసోసియేషన్ సభ్యులు, మహిళలు పాల్గొన్నారు.

## నూతన కమిటీ హాల్ ప్రారంభోత్సవం



**తుర్కయంజాల్ ఫిబ్రవరి 10(ప్రభాతవార్త)** తుర్కయంజాల్ మున్సిపాలిటీని ఆదర్శవంతమైన మున్సిపాలిటీ గా తీర్చిదిద్దుతామని ఇబ్రహీంపట్నం నియోజకవర్గం ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి పేర్కొన్నారు. ఆదివారం మున్సిపాలిటీ పరిధిలోని సూరజ్ నగర్ కాలనీ పేజ్ 3 కమిటీ హాల్ 20వ, వార్డు సూరజ్ నగర్ కాలనీలో నూతన కమిటీ హాల్ భవనాన్ని వారు తెలంగాణ రాష్ట్ర రోడ్డు డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ మల్ రెడ్డి రామ్ రెడ్డితో కలసి కమిటీ హాల్ భవనాని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర రోడ్డు డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ మల్ రెడ్డి రాంరెడ్డి, టెస్కాబ్ వైస్ చైర్మన్ డిసిసిబి చైర్మన్ కొత్తకుర్మ సత్తయ్య, టి పి సి సి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కొత్త కుర్మా శివకుమార్, తుర్కయంజాల్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు కొత్త కుర్మా మంగమ్మ శివకుమార్, మాజీ కౌన్సిలర్లు కోసికే ఐలయ్య, గుండ్లపల్లి ధనరాజ్ గౌడ్, గుండా ధనరాజ్, పుల్లగుర్రం విజయానంద్ రెడ్డి, రేవెల్లి యాదగిరి, బొక్క రవీందర్ రెడ్డి, సూరజ్ నగర్ కాలనీ అధ్యక్షులు వై.భూపతి రెడ్డి, ఉపాధ్యక్షులు కె జగత్ రాజు, కార్యదర్శి జి శ్రీనివాస్ గౌడ్, ఉప కార్యదర్శి నరసింహా, కోశాధికారి జంగయ్య, ఉపాధ్యక్షులు ఆర్ .సంజీవరెడ్డి, సామ భీమ్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు కాలనీ మహిళలు తదితరులు పాల్గొన్నారు.

## కర్మన్‌ఘాట్ హనుమాన్ దేవాలయంలో మల్‌రెడ్డి రాంరెడ్డి ప్రత్యేక పూజలు



రోడ్డు డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ మల్‌రెడ్డి రాంరెడ్డికి ఆశీర్వచనం చేస్తున్న ఆలయ అర్చకులు

**సైదాబాద్, ఫిబ్రవరి 10 ప్రభాతవార్త:** రాష్ట్ర రోడ్డు డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ మల్‌రెడ్డి రాంరెడ్డి తన జన్మదినం సందర్భంగా సోమవారం కర్మన్‌ఘాట్ హనుమాన్ దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. పూజల అనంతరంనఆలయ అర్చకులు ఆయనకు ఆశీర్వచనం చేసి స్వామి వారి తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో బేర బాలకిషన్, కందికంటి శ్రీధర్‌గౌడ్, బబ్బూరి ఆనంద్, కందికంటి శ్రీధర్‌గౌడ్, డివిజన్ అధ్యక్షులు బండ సురేందర్‌రెడ్డి, బద్దుల వేణు గోపాల్‌యాదవ్, శ్రీపాల్‌రెడ్డి, మంజుల రెడ్డి, కిషోర్‌గౌడ్, యువజన నాయకులు గుర్రం శ్యామ్ చరణ్‌రెడ్డి, గణేష్‌రెడ్డి, రామకృష్ణారెడ్డి, శివ తదితరులు పాల్గొన్నారు.

## ప్రధాని నరేంద్ర మోడీ చిత్రపటానికి పాలాభిషేకం



**నేరేడ్మెట్, ఫిబ్రవరి 10. ప్రభాతవార్త.**

రాష్ట్ర భారతీయ జనతా పార్టీ ఆదేశాల మేరకు వినాయక్ నగర్ డివిజన్ లోని కాకతీయ నగర్ గౌరీ శంకర్ వద్ద కేంద్ర బడ్జెట్ 2025 అన్ని రంగాల అభివృద్ధికి సహకరించే విధంగా ఉందని, న్యాయమైన బడ్జెట్ అని తెలియచేస్తూ భారత ప్రధాని శ్రీ నరేంద్ర మోడీ గారి చిత్రపటానికి పాలాభిషేకం చేసి బడ్జెట్ లోని ముఖ్య అంశాలపై ప్రసంగించడం జరిగింది. బిజెపి ప్రభుత్వం పేదల ప్రభుత్వము అన్నారు. ఈ కార్యక్రమంలో బిజెపి అభిమానులు , కాలనీ వాసులు, బీజేపీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు...

## పార్కులు, శ్మశానవాటికల అభివృద్ధికి నిధులు కేటాయించాలి



**మల్కాజిగిరి ఫిబ్రవరి10,ప్రభాతవార్త :**

సికింద్రాబాద్ జోనల్ కమిషనర్ కార్యాలయంలో జరిగిన ప్రజావాణిలో జెడ్సీ రవికుమార్ తో ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి సమావేశమైవినతిపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా మల్కాజిగిరి సర్కిల్ పరిధిలోని పార్కులు, శ్మశానవాటికల అభివృద్ధి కోసం ప్రత్యేక నిధులు కేటాయించాలని, అదే విధంగా సి.సి రోడ్ల ఏర్పాటుకు కూడా నిధులు కేటాయించాలని కోరుతూ జోనల్ కమిషనర్ కు ఎమ్మెల్యే. వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ మేకల సునీత యాదవ్, రావుల అంజయ్య, జగదీష్ గౌడ్, రాము యాదవ్, అమీనుద్దీన్, తదుతరులు ఉన్నారు.

## ఆధ్యాత్మిక చింతనతో మానసిక ప్రశాంతత



**మల్కాజిగిరి ఫిబ్రవరి10, ప్రభాతవార్త :**

ఆధ్యాత్మిక చింతనతో మానసిక ప్రశాంతత లభిస్తుందని గౌతమ్ నగర్ డివిజన్ కార్పొరేటర్ మేకల సునీత రాము యాదవ్ అన్నారు. మల్లికార్జున నగర్ లోని మల్లన్న దేవాలయంలో సోమవారం విగ్రహ ప్రాణప్రతిష్ట దేవతలు కలహ భైరవ ,దక్షిణా మూర్తి , విష్ణుమూర్తి ,బ్రహ్మ ,శ్రీచక్రం, సింహవాహనం, ప్రతిష్ట, కార్యక్రమాలు భక్తి శ్రద్ధలతో జరిగాయి. ఈ కార్యక్రమానికి కార్పొరేటర్ దంపతులు మేకల సునీత రామ యాదవులు అతిథులుగా హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు.అనంతరం అన్నదాన కార్యక్రమం జరిగింది ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ నాయకులు మేకల రాము యాదవ్ రావుల అంజయ్య తదితరులు పాల్గొన్నారు.

## చిలుకూరి బాలాజీ పూజారి రంగరాజన్‌పై దాడిపై ఖండన



చిలుకూరి బాలాజీ దేవాలయం పూజారి రంగరాజన్‌ను పరామర్శిస్తున్న బ్రహ్మణ పెడరేషన్ ప్రతినిధులు

**ఉప్పల్, ఫిబ్రవరి 10 ప్రభాతవార్త :** చిలుకూరి బాలాజీ వెంకటేశ్వరస్వామి పూజారి ప్రొ.రంగరాజన్‌పై దాడి చేసిన వ్యక్తులను వెంటనే అరెస్ట్ చేయాలని పెడరేషన్ ఆఫ్ ఆల్ బ్రహ్మణ్ అసోసియేషన్ వర్కింగ్ ప్రసిడెంట్ ఒరిగాల రమేష్, ప్రధాన కార్యదర్శి గంగు నరసింహామూర్తి, అర్చక సంఘం ప్రతినిధి భాస్కరభట్ల రామశర్మ పేర్కొన్నారు. ఈ మేరకు సోమవారం చిలుకూరిలో రంగరాజన్‌ను వారు పరామర్శించారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో వారు మాట్లాడుతూ చట్టాన్ని తమ చేతుల్లోకి తీసుకుని దుండగులు ఆయన ఇంట్లోకి ప్రవేశించి అసభ్య పదజాలంతో దూషించడం సబబు కాదన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి వారిని అరెస్ట్ చేసి కఠినంగా శిక్షించాలని కోరారు. రంగరాజన్‌కు తాము పూర్తి మద్దతు ప్రకటిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో పలువురు బ్రహ్మణ సంఘం ప్రతినిధులు పాల్గొన్నారు.



బాధ్యతలు చేపట్టిన హైదరాబాద్ సెంట్రల్ బిజెపి అధ్యక్షుడు దీపక్‌రెడ్డిని సన్మానించి అభినందిస్తున్న కొలన్ శంకర్‌రెడ్డి

## మహిళా సాధికారతతోనే అభివృద్ధి:చిలుక



మహిళా సంఘం వార్షికోత్సవంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న చిలుక మధుర ఉపేందర్ రెడ్డి

**ఎల్.బి.నగర్, ఫిబ్రవరి 10 ప్రభాతవార్త:**

మహిళా సాధికారతతోనే అభివృద్ధి సాధ్యమవుతుందని రాష్ట్ర కాంగ్రెస్ నాయకురాలు చిలుక మధుర ఉపేందర్ రెడ్డి పేర్కొన్నారు. ఆర్ కే పురం డివిజన్ శ్రీరామకృష్ణ పురం కాలనీ మహిళా సంఘం ప్రథమ వార్షికోత్సవం కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా చిలుక మధుర ఉపేందర్ రెడ్డి, డాక్టర్ సత్యశ్రీతో కలిసి జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం ఆట, పాటలతో ఐటీడీఈస్ ప్రాంగణం మారుమోగింది. ఈ సందర్భంగా ఆమె అందరికి బ్యాడ్జీలు, బహుమతి ప్రదానం చేసారు. డాక్టర్ సత్యశ్రీ మహిళకు క్యాన్సర్ గురించి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షురాలు అన్నపూర్ణ, సెక్రటరీ రాధ, కోశాధికారి విజయలక్ష్మి, ఉపాధ్యక్షురాలు నీలిమ, శకుంతల, సొసైటీ కార్యదర్శి రాజేశ్రీ రామారావు,అర్చన,స్వప్న, సురేఖ,మాధవి,శకుంతల,పుష్ప రేఖ, సరిత, రాణి పాల్గొన్నారు.

## వికలాంగుల పెళ్లికి ఉప్పల ఫౌండేషన్ చేయూత

**ఎల్.బి.నగర్, ఫిబ్రవరి 10 ప్రభాతవార్త:** అన్ని వర్గాల ప్రజలకు అన్ని విధాలా ఆదుకుంటూ ఆపద్బాంధవుడిగా ఆడబిడ్డల వివాహానికి అండగా నిలుస్తమని టిపిసిసీ ప్రచార కమిటీ రాష్ట్ర కో కన్వీనర్, ఐవిఎఫ్ జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ ఉప్పల శ్రీనివాస్ గుప్త పేర్కొన్నారు. నాగోల్ ఉప్పల శ్రీనివాస్ గుప్త క్యాంపు కార్యాలయంలో వరంగల్ కి చెందిన తెజావత్ బాలు, ఇస్లా గీత గుడ్ వే ఫౌండేషన్ లో వివాహానికి పూస్తే మట్టెలు, చీర, గాజులను ఉప్పల శ్రీనివాస్ గుప్త, ప్రథమ మహిళ ఉప్పల స్వప్న కానుకగా అందజేశారు. ఈ సందర్భగా ఆయన మాట్లాడుతూ ఉప్పల ఫౌండేషన్ ద్వారా పేద కుటుంబాలకు చెందిన వారికి పూస్తే మట్టెలు, చీర, గాజులు ఇస్తామన్నారు. ఈ కార్యక్రమంలో రమణయ్య, గుడ్ వే ఫౌండేషన్ (వికలాంగుల సేవా సంస్థ) అధ్యక్షురాలు ఎరుపల్లి మంగమ్మ, ప్రధాన కార్యదర్శి షన్ముక రావు, కోటగిరి దేవనందం, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## బిసిలు అన్ని రంగాల్లో అభ్యున్నతి సాధించాలి : కటకం



సమావేశంలో మాట్లాడుతున్న కటకం నర్సింగ్ రావు

**ఎల్.బి.నగర్, ఫిబ్రవరి 10 ప్రభాతవార్త:** బీసీలు అన్ని రంగాలలో అభ్యున్నతి సాధించాలని మన ఆలోచన ఫౌండర్, అవేర్ ఫౌండేషన్ చైర్మన్ కటకం నర్సింగ్ రావు పేర్కొన్నారు. నాగోల్ మన ఆలోచన ప్రధాన కార్యాలయంలో కటకం నర్సింగరావు ఆధ్వర్యంలో ఆదివారం యాదవ కులస్తుల ఆత్మీయ సమ్మేళనం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీసీలు రాజకీయంగా వెనకబడిపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. బీసీలు హక్కులు సాధించుకోవాలంటే రాజ్యాధికారం సాధించాలన్నారు. ఈ సమావేశంలో యాదవ సంఘం నాయకులు పోలె బోయిన సత్తయ్య యాదవ్, బచ్చనబోయిన శ్రీనివాస్ యాదవ్, కదిరే కృష్ణ యాదవ్, పిడికిలి రాజు, డాక్టర్ ఆవుల వెంకట్ యాదవ్, పిల్లి వెంకటేష్ యాదవ్, బాసబోయిన లింగస్వామి యాదవ్, కన్నెబోయిన సత్తయ్య యాదవ్, చిమల శ్రీనివాస్ యాదవ్, వాసు యాదవ్, బాలరాజ్ యాదవ్, దామోదర్ యాదవ్, బొల్లిగార్ల వీరాంజకనేయులు, నాయకులు పాల్గొన్నారు.

## ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి ఇంట్లో విషాదం



బండారి పద్మ పార్థివదేహానికి నివాళులు అర్పిస్తున్న స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్, మాజీ మంత్రి తన్నీరు హారీష్‌రావు తదితరులు

**ఉప్పల్, ఫిబ్రవరి 10 ప్రభాతవార్త :** అనారోగ్యంతో మరణించిన ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి వదిన బండారి పద్మ పార్థివ దేహాన్ని సోమవారం రాష్ట్ర అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్, మల్కాజిగిరి ఎంపి ఈటల రాజేందర్, మాజీ మంత్రి తన్నీరు హరీష్‌రావు, అంబర్‌పేట ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్, మాజీ ఎమ్మెల్యే బేతి సుభాష్‌రెడ్డి, మాజీ కార్పొరేషన్ చైర్మన్లు రావుల శ్రీధర్‌రెడ్డి, ఎర్రోళ్ల శ్రీనివాస్, పలువురు బిఆర్ఎస్ పార్టీ నేతలు సందర్శించి నివాళులు అర్పించారు. ఆదివారం సాయంత్రం బండారి పద్మ అనారోగ్యంతో మృతి చెందిన విషయం తెలిసిందే. విషయం తెలుసుకున్న పలువురు పార్టీ నేతలు ఆమె పార్థీవదేహాన్ని సందర్శించి నివాళులు అర్పించారు. సైనిక్‌పురి నుంచి ర్యాలీగా వెళ్లి కీసరలోని వ్యవసాయ క్షేత్రంలో అంత్యక్రియలు నిర్వహించారు. పలువురు పార్టీ నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## మీర్‌పేట్ కార్పొరేషన్ కాంగ్రెస్ ఎస్సీ విభాగం అధ్యక్షునిగా శ్రీనివాస్



మాదరి శ్రీనివాస్‌కు నియామకపు ఉత్తర్వులు అందజేస్తున్న కెఎల్‌ఆర్

**సరూర్‌నగర్, ఫిబ్రవరి 10 ప్రభాతవార్త:** మహేశ్వరం నియోజకవర్గంలోని మీర్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ కాంగ్రెస్ ఎస్సీ విభాగం నూతన అధ్యక్షునిగా సీనియర్ దళిత నాయకుడు మాదరి శ్రీనివాస్ నియమితులయా్యరు. ఈ మేరకు మహేశ్వరం నియోజకవర్గ కాంగ్రెస్ ఎస్సీ సెల్ విభాగం అధ్యక్షుడు క్యారగారి శ్రీధర్ నియామకపు ఉత్తర్వులు జారీ చేశారు. ఈ ఉత్తర్వులను మాజీ ఎమ్మెల్యే, మహేశ్వరం నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి కిచ్చెన్నగారి లక్ష్మారెడ్డి చేతుల మీదుగా శ్రీనివాస్ అందుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తనకు పదవి ఇప్పించిన కెఎల్‌ఆర్‌తో పాటు దేప భాస్కర్‌రెడ్డిలకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర కాంగ్రెస్ ఎస్సీ సెల్ మాజీ ఉపాధ్యక్షుడు బాల్‌నింగని జంగయ్య, పుట్టగళ్ళ జగన్, భాను పాల్గొన్నారు.

## అనుమానాస్పదస్థితిలో జిహెచ్‌ఎంసి కార్మికురాలి మృతి

**ఉప్పల్, ఫిబ్రవరి 10 ప్రభాతవార్త :** అనుమానాస్పదస్థితిలో ఉప్పల్ నల్ల చెరువులో పడి ఒక మహిళ మృతి చెందింది. ఎస్ఐ కోటేశ్వర్‌రావు తెలిపిన వివరాల ప్రకారం.. ఉప్పల్ నల్ల చెరువు కట్టపై ఆదివారం రాత్రి 7 గంటల సమయంలో జిహెచ్‌ఎంసి అవుట్ సోర్సింగ్ కార్మికురాలి ఐడి కార్డు, చెప్పులు, ఇతర వస్తువులు గమనించారు. వీటి ఆధారంగా మహిళ జిహెచ్‌ఎంసిలో ఉప్పల్ సర్కిల్‌లో అవుట్‌సోర్సింగ్ కార్మికురాలిగా పనిచేస్తున్నట్లు గుర్తించారు. మృతురాలు ఉప్పల్ భరత్‌నగర్‌కు చెందిన కందుల శారదగా గుర్తించారు. మృతిరాలి భర్త యాదగిరి చనిపోయాదని, ఇద్దరు కుమార్తెలు ఉన్నారని పోలీసులు తెలిపారు. ఆర్థిక సమస్యల కారణంగా ఆత్మహత్య చేసుకుని ఉండవచ్చని పోలీసులు భావిస్తున్నారు. ఈ మేరకు ఉప్పల్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.